


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  ఆదివారం 29 ఆగస్టు 2021  సంపుటి : 03  సంచిక :26  పేజీలు : 4  వెల : రూ 3-00


## కాషాయ పార్టీ ఆదాయం 50 శాతం ఎగబాకింది..మరి మీ సంగతేంటి : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాల వెల్లువతో 2019-20లో బీజేపీ ఆదాయం 50 శాతం పెరిగిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) నివేదిక ఆధారంగా కాషాయ పార్టీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చురకలు వేశారు. 2019-20లో బీజేపీ ఆదాయం 50 శాతం పెరిగిందనే వార్తా కథనాన్ని ట్విటర్‌లో రాహుల్ షేర్ చేస్తూ బీజేపీ రాబడి 50 శాతం పెరిగింది మరి మీ ఆదాయం సంగతేంటి..? అని రాహుల్ ట్వీట్ చేశారు. 2018-19, 2019-20 మధ్య బీజేపీ ఆదాయం రూ 2410 కోట్ల నుంచి రూ 3623 కోట్లకు పెరిగిందని, ఈ వ్యవధిలో కాషాయ పార్టీ రాబడి ఏకంగా 50.34 శాతం వృద్ధి చెందిందని ఏడీఆర్ నివేదిక శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ ఆదాయం రూ 918 కోట్ల నుంచి రూ 682 కోట్లకు పడిపోయిందని ఏడీఆర్ పేర్కొంది. ఇక ఎన్సీపీ ఆదాయం అత్యధికంగా 68.77 శాతం పెరగడం గమనార్హం. 2018-19లో ఎన్సీపీ ఆదాయం రూ 50.7 కోట్లుగా నమోదవగా 2019-20లో అది రూ 85.5 కోట్లకు ఎగిసింది.




## హుజురాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: టీఆర్ఎస్‌ను గద్దె దించటానికే బీజేపీ నేత బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా చార్మినార్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అవినీతి రూపంలో వేల కోట్లు వృథా అవుతున్నాయని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం ఎన్ని కుట్రలు చేసినా హుజురాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. దళితులకు సీఎం పదవి, మూడెకరాల భూమి పేరుతో కేసీఆర్ మోసం చేశారని, బీసీలకు టీఆర్ఎస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు.



## ఏపీలో కొత్తగా1,321 కరోనా కేసులు..

అమరావతి: గడిచిన 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 64,461 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,321 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి19 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,807 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 1,499 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19 లక్షల 81 వేల 906 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శనివారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం14,853 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 2,64,71,272 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.





## ఒడిశా- ఉత్తరాంధ్ర తీరం వెంబడి అల్పపీడనం

విశాఖ: వాయువ్య మరియు పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతంలో ఒడిశా- ఉత్తరాంధ్ర తీరం వెంబడి అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో మంగళవారం వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణం శాఖ వెల్లడించింది. తీరం వెంబడి గంటకు 50-60 కీ.మీ వెగంతో గాలులు సముద్రం అలజడిగా ఉంటుంది. రేపటి వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది.



# పశుపోషణతో రైతులకు మెరుగైన అదాయం



వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ పిలుపు

ఘనంగా శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయ స్నాతకోత్సవం

విజయవాడ ఆగష్టు 28 గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మెరుగైన అదాయాన్ని అందించటంలో పశు సంపద పాత్ర ఎంతో కీలకమైనదని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పశుపోషణ కీలక భూమికను పోషిస్తుందన్నారు. తిరుపతి వేదికగా శనివారం జరిగిన శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 10 వ స్నాతకోత్సవంలో కులపతి హోదాలో గౌరవ గవర్నర్ పాల్గొన్నారు. విజయవాడ రాజ్ భవన్ నుండి వెబినార్ విధానంలో గవర్నర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా గౌరవ హరిచందన్ మాట్లాడుతూ రైతులు అదనపు అదాయం కోసం వ్యవసాయ అనుబంధ రంగాలకు మరలుతున్నారని, హరిత విప్లవం, ఆర్థిక సరళీకరణ, వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోవడం, కూలీల కొరత వంటి విబిన్న కారణాల వల్ల రైతులు పశుపోషణపై ప్రత్యేక దృష్టి నిలిపారన్నారు. భారతీయ వ్యవసాయంలో పశుపోషణ అంతర్భాగం కాగా, గ్రామీణ జనాభాలో మూడింట రెండు వంతుల మంది జీవనోపాధికి పశు సంతతి కీలకంగా మారిందన్నారు. పశు వైద్యులు సాంకేతిక, ఆర్థిక, నైతిక మద్దతును పెంపకందారులకు అందించడం ద్వారా పశు పోషణను మరింత లాభదాయకంగా మార్చేందుకు మార్గనిర్దేశం చేయవలసి ఉందన్నారు. పశువైద్యులు వృత్తిపరంగా, నైతికంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతుల జీవన ప్రమాణ స్థాయిని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని గవర్నర్ కోరారు. కరోనా కారణంగా విద్యాభ్యాసం పలు మార్పులకు లోనవుతుండగా, డిజిటల్ క్లాస్ రూమ్ వ్యవస్థ తెరపైకి వచ్చిందని, గరిష్ట సంఖ్యలో విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా ఈ వ్యవస్థ రూపుదిద్దుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. జాతీయ విద్యా విధానం 2020తో దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయని, హేతుబద్ధమైన ఆలోచన, ధైర్యం, స్థితిస్థాపకత, శాస్త్రీయ స్వభావం, సృజనాత్మక ఊహ, నైతిక విలువలు కీలకం కానున్నాయని ఇవి సమాజానికి మంచి పౌరులను అందిస్తాయన్న విశ్వాసం తనకుందని గవర్నర్ అన్నారు. నేటి యువకులు దేశానికి మూల స్తంభాల వంటి వారని, వారికి మార్గం నిర్దేశించే విద్యాలయాలు నూతనత్వాన్ని సముపార్జించుకోవాలన్నారు. విద్యా సంస్థలలో వారు అలవరుచుకునే సమయపాలన, పరస్పర సహాయం, సహకారం, క్రమశిక్షణ వారిని సంస్కారవంతులుగా, చట్టానికి కట్టుబడి ఉండేలా తయారు చేస్తాయని గౌరవ హరిచందన్ అన్నారు. సమాజాన్ని బలోపేతం చేయడంలో విద్యార్థులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, విద్యార్జన వారి ప్రాథమిక వృత్తి కాగా, తీరిక సమయాలలో సామాజిక సేవలో తమను తాము నిమగ్నం చేసుకోవాలని గవర్నర్ పిలుపు నిచ్చారు. విద్యార్థులు తమ సామాజిక సేవలో భాగంగా గ్రామీణ, పట్టణ మురికివాడల అభివృద్ధి, మెడికో-సోషల్ సర్వేలు, మెడికల్ సెంటర్ల ఏర్పాటు, మాస్ ఇమ్యునైజేషన్, శానిటేషన్ డ్రైవ్, వయోజన విద్య వంటి అనేక అంశాలను చేపట్టాలన్నారు. చివరి సంవత్సరం బివిఎస్ ఇ విద్యార్థులు తమ శిక్షణా కాలంలో రైతు భరోసా కేంద్రాల పనితీరును మూల్యాంకనం చేయటం ఆచరణీయమన్నారు. స్టార్టప్‌ల ఫైనాన్సింగ్, వ్యవస్థాపకత, ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం "స్టార్ట్-అప్ ఇండియా" ప్రచారాన్ని ప్రారంభించిందని, విద్యార్థులు అవకాశాలను అన్వేషించి పారిశ్రామికవేత్తలు కావాలని తద్వారా మరింత మందికి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. రాష్ట్రం 974 కిమీ తీర రేఖతో నీటి వనరులు, 1.74 లక్షల హెక్టార్ల ఉప్పునీటి సంభావ్యతతో భారతదేశంలో మత్స్య రంగంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా 14.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, మత్స్యశాఖ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రత్యేక మత్స్య శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని ప్రకటించిందన్నారు. యువత సమాజానికి చేసే సేవల ద్వారా ఈ దేశం యొక్క గత వైభవాన్ని పునరుద్ధరించడానికి కృషి చేయాలన్నారు. విజయవాడ రాజ్ భవన్ నుండి గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా, గవర్నర్ వారి సంయిక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్, విశ్వవిద్యాలయ పరిశోధన విభాగపు సంచాలకులు డాక్టర్ కె సర్జన రావు, విస్తరణ విభాగ సంచాలకులు డాక్టర్ జి వెంకట నాయిడు పాల్గొన్నారు. తిరుపతిలో వ్యవసాయ శాస్త్రవేత్తల నియామక బోర్డు సభ్యుడు డాక్టర్ ఎ. కె. శ్రీవాస్తవ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకాగా, విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ వి. పద్మనాభ రెడ్డి, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, అద్యాపక, అద్యాపకేతర సిబ్బంది, అవార్డు గ్రహీతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలుగు సమాజం శాసించే శక్తిగా ఎదగాలి: సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



దిల్లీ: తెలుగు భాషను కాపాడుకునేందుకు ఉద్యమస్థాయిలో భాషావేత్తలు కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. 'వీధి అరుగు- దక్షిణాఫ్రికా తెలుగు సంఘం' సంయుక్తంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ సదస్సులో ఆయన వర్చువల్ గా పాల్గొన్నారు. మాతృభాష లేనిదే మనిషికి మనుగడ లేదన్న సీజేఐ ...ప్రతి ఒక్కరూ అమ్మభాషను మాట్లాడడం ఓ గౌరవంగా భావించాలని పిలుపునిచ్చారు. ఆంగ్లం మోజులో పడి తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదని చెప్పారు.''కాలానుగుణంగా భాషలో మార్పు రాకపోతే ఆ భాష, సంస్కృతి పతనమైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. చైతన్యవంతమైన తెలుగు సమాజం తమ సుదీర్ఘ చరిత్రలో నేటి వరకు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు భాషలో దిద్దుబాట్లు, సర్దుబాట్లు చేసుకుంటూ మనుగడ కొనసాగించగలుగుతోంది. సంక్లిష్ట వచనా ప్రక్రియ నుంచి సరళమైన ప్రక్రియలోకి మహాప్రస్థానం సాగింది. ఈ ప్రస్థానంలో ముందు చూపుతో, తగు మార్పులతో ప్రగతిశీలకంగా భాషను మలచినటువంటి యుగపురుషులలో గిడుగు రామ్మూర్తి పంతులుగారు అగ్రగణ్యులు. సమకాలీకులైన గురజాడ వెంకటఅప్పారావుగారు, కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గిడుగు రామ్మూర్తిగారి త్రయం సాహితీ, సామాజిక సంస్కరణలతో తెలుగు భాషను సామాన్య ప్రజల భాషగా మలిచారు. స్వాతంత్ర్యం సిద్ధించాక తెలుగు భాషలో తెలుగుదనాన్ని మళ్లీ ఎంతో చాకచక్యంగా ఉపయోగించి తెలుగు ప్రజలను ఆలోచింపజేసి వారి అభిమానాన్ని చూరగొన్న ఘట్టం మాతరం వారందరం చూడగలిగాం" అని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు.''నందమూరి తారకరామారావుగారు అగ్రశ్రేణి సినీనటుడిగా వెలుగొందడం వలనే ఆయన సులువుగా అధికారంలోకి రాగలిగారని సాధారణంగా అందరూ అభిప్రాయపడుతుంటారు. ఆనాటి రాజకీయ పరిస్థితులు ఆయనకు కచ్చితంగా అనుకూలించాయి. అందులో సందేహం లేదు. కానీ, నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రం ఇందుకు కాస్త భిన్నంగా ఉంది. ఊరారా తిరిగి సరళమైన సామాన్యుడి భాషలో అద్భుతమైన ఉచ్చారణతో అనర్గళంగా ప్రసంగించి తెలుగువాడి ఆత్మగౌరవాన్ని తట్టిలేపిన ఆయన వాక్చాతుర్యం ఆయన విజయంలో కీలక పాత్ర వహించింది. ఎందరో తారలను అందలమెక్కించిన సినిమా రంగంలో కూడా తెలుగు భాష పరిస్థితి దయనీయంగా ఉంది. తెలుగు సినిమా అర్థం కావాలంటే ఇంగ్లీష్ లో సబ్ టైటిల్స్ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగు భాషను కాపాడే బాధ్యత ప్రసార మాధ్యమాలపై కూడా ఉంది. ఇకనైనా మేల్కొని దిద్దుబాటు దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తున్నాను. తెలుగు భాషకు గతంలో ఎన్నడూ లేనంతగా ముప్పు పొంచి ఉంది. కాపాడుకునేందుకు ఉద్యమ స్థాయిలో భాషాభిమానులందరూ సిద్ధం కావాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మన భాషను మలచుకుంటూ ... ప్రపంచ భాషల్లోని మంచిని సమ్మిళితం చేసుకుంటూ మన భాషను సుసంపన్నం చేసుకోవాలి. అదే సమయంలో తెలుగు మాధ్యమంలో చదివితే భవిష్యత్ ఉండదనే అపోహలు తొలగించాలి. డిగ్రీ వరకు నేను తెలుగు మాధ్యమంలోనే చదివాను. ఇంగ్లీషు అభ్యాసం ఎనిమిదో తరగతిలో మొదలైంది. ఉద్యోగ ధర్మం కనుక ఆంగ్లంలో అభ్యాసం, వాడకం కొనసాగిస్తున్నాను. పల్లెటూరిలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో మాతృభాషలో చదువుకుని ఈరోజు నేను ఈ స్థాయికి చేరుకోగలిగాను. పాఠ్య పుస్తకాలు, విద్యాబోధన వ్యవహారికంలో కొనసాగడం నా లాంటి వారికి ఎంతో ఉపయోగపడింది. మనుషులంతా ఆలోచించేది మాతృ భాషలోనే.. ఆ మాతృభాషలో విద్యాబోధన కొనసాగితే కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి.


## అధికారులపై టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు నోటి దురుసు

నర్సీపట్నం మహిళా తహశీల్దార్ పై అయ్యన్న అసభ్య వ్యాఖ్యలు

విశాఖపట్నం: మరోసారి అధికారులపై టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు నోటి దురుసుతో ప్రవర్తించారు. మహిళా తహశీల్దార్‌ను ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడారు. అధికారులను కించపరిచేలా దొంగలతో కుమ్మక్కయ్యారంటూ వ్యాఖ్యానించారు. అధికారుల పట్ల హేళనగా మాట్లాడారు. తహశీల్దార్‌పై ఈ రకంగా వ్యాఖ్యలు చేయడంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో కూడా అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌పై కూడా దురుసుగా మాట్లాడారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఓ సీనియర్ ప్రజా ప్రతినిధిగా చెప్పుకునే అయ్యన్న తీరు మారకపోవడం దారుణం అంటున్నారు.

## యథేచ్ఛగా పేదవాడి రేషన్ బియ్యం దోపిడి: దేవినేని ఉమ

విజయవాడ: కృష్ణా జిల్లా మైలవరంలో యథేచ్ఛగా పేదవాడి రేషన్ బియ్యం దోపిడి జరుగుతోందని మాజీ మంత్రి దేవినేని ఉమ ట్విటర్ వేదికగా ఆరోపించారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ దందా సాగుతోందన్నారు. తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని, రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి సరఫరా చేశారన్నారు. నేతలతో కుమ్మక్కై.. పేదవాడి బియ్యం దోచేస్తున్న మీ ప్రజాప్రతినిధుల అవినీతిపై ఏం చర్యలు తీసుకుంటారని సీఎం జగన్‌ను దేవినేని ఉమ ప్రశ్నించారు.



## ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ ఏం చేసిందో చెప్పగలదా?

గంగవరం పోర్టుపై టీడీపీ అసత్యాలు ప్రచారం చేస్తోంది

ధరలపై కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు ఎందుకు నిలదీయరు?

మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై టీడీపీకి చర్చా వేదిక పెట్టే హక్కులేదని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ ఏం చేసిందో చెప్పగలదా? అని ప్రశ్నించారు. గంగవరం పోర్టుపై టీడీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు."పెట్రోల్ ధరల పెంపుపై మేం అసంతృప్తిగా ఉన్నాం. పెట్రోల్ ధరలు కేంద్రం పరిధిలో ఉందన్న విషయం టీడీపీకి తెలియదా?. ధరలపై కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు ఎందుకు నిలదీయరు?. ఉత్తరాంధ్రకు అశోక్ గజపతిరాజు ఏం చేశారు?. న్యాయ సమస్యలు పరిష్కారమయ్యాక మూడు రాజధానులను ఏర్పాటు చేస్తాం. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సీఎం జగన్ వ్యతిరేకించారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ తన నిర్ణయం చెప్పిందని" బొత్స సత్యనారాయణ అన్నారు.



# సంపాదకీయం

ఆదివారం 29 ఆగస్టు 2021

## అయిన కాడికి అమ్మేసుకుంటూపోతారా

ప్రభుత్వాలు శాశ్వత ఆస్తులను అమ్మి పక్కాగా సొమ్ము చేసుకోవాలని చూస్తున్నాయి. ఇందుకు రకరకాల పేర్లతో ప్రజలను ప్రలోభ పెట్టాలనుకుంటున్నాయి. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అదే తంతు. ఈ విక్రయాల వ్యవహారం పతాకస్థాయికి చేరుకుంది. నగదీకరణ పేరుతో కేంద్రప్రభుత్వం ఆరులక్షల కోట్ల రూపాయలు సమీకరిస్తామని చెబుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా అదే బాటలో ఉన్నాయి. ప్రజల నుంచి ఆందోళన చెలరేగకుండా సంక్షేమానికి ఈ నిధులను వినియోగిస్తామంటున్నాయి. ప్రభుత్వ స్థలాలు, సంస్థలను తెగనమ్మి డబ్బు పంచి పెట్టేయడం ద్వారా అధికారాన్ని స్థిరపరుచుకోవాలనేదే ఎత్తుగడ. ప్రభుత్వ స్థలాలు ప్రజల ఆస్తులు వాటికి ప్రభుత్వాలు ధర్మకర్తలు మాత్రమే. శాశ్వత యజమానులు ప్రజలే. అయితే అడిగేవారు లేకపోవడం సార్వభౌమత్వాన్ని ఆపాదించుకుంటున్న ప్రభుత్వాలు తమ ఇష్టారాజ్యంగా పరిపాలన చేస్తున్నాయి. భవిష్యత్తును అంధకారమయంగా మారుస్తున్నాయి.ఎన్డీఏ సర్కారు చాలా తెలివిగా పావులు కదుపుతోంది. గతంలో ప్రభుత్వాలు పెట్టుబడుల ఉపసంహరణ రూపంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నెమ్మదిగా వదిలించుకుంటూ సొమ్ము చేసుకుంటుండేవి. ఏదేని కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే భూములు దొరకకపోతే , రాష్ట్రాల వాటా రూపంలో బాధ్యతను బదలాయిస్తూ తెలివిగా భారాన్ని తగ్గించుకునేవి. ఇప్పుడు మోడీ హయాంలో ఆకర్షణీయమైన పేర్లతో గత ప్రభుత్వాలను తలదన్నే పథకాలను రచిస్తోంది. జీవితబీమా వంటి సంస్థను నగదీకరించుకునే ఎత్తుగడ వేస్తోంది. దేశజనాభాలో దాదాపు సగం మందికి జీవన భరోసా ఇస్తున్న సంస్థను సైతం పణంగా పెట్టే సాహసానికి తెగిస్తోంది. రైల్వేలు, రహదారులు, పోర్టులు, మౌలిక వసతులు అన్నిటా కేంద్రం తన బాధ్యతను వదిలించుకుంటూనే నగదు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో రవాణా, మౌలిక వసతులు, జీవితబీమా వంటి రంగాలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ కోల్పోతుంది. ప్రజలపై విపరీతంగా భారం పడే అవకాశాలున్నాయి. ఈనిధులను ఏమేరకు సద్వినియోగం చేస్తారనేది ప్రశ్నార్థకమే. తాత్కాలికంగా ఏర్పడిన కరోనా వంటి విపత్తులను సాకుగా చూపి ప్రజలు వ్యతిరేకించలేని విధంగా నిస్సహాయం చేస్తున్నాయి.ఒక రకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మెచ్చుకోవాలి. మొహమాటానికి పోకుండా సర్కారీ భూములను అమ్మేసి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని గట్టిగా చెబుతోంది. దళిత బంధు పథకానికి లక్ష కోట్ల రూపాయలవరకూ అవసరమవుతాయి. వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా వచ్చిన సొమ్మునే వెచ్చిస్తామంటూ ఆర్థిక శాఖమంత్రి హరీశ్ రావు బహిరంగంగా ప్రకటించారు. బీసీలకు, ఆర్థికంగా వెనకబడిన ఇతరవర్గాలకు సైతం పేదల బంధును ఆచరణలోకి తెస్తామంటూ కేసీఆర్ కొ?త్తగా హామీని గుప్పించారు. దానికి కూడా ఇదే తరహా లో నిధులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. సాధారణ వార్షిక ఆదాయంలో సగం నిధులు ఉద్యోగుల జీతాలకు, పింఛన్లకు సరిపోతున్నాయి. సంక్షేమపద్దులో మిగిలిన నిధులను సరిపెట్టాల్సి వస్తోంది. కొత్త పథకాలకు డబ్బులు కావాలంటే ఆస్తులు అమ్మక తప్పదు. అందుకు సర్కారు సిద్ధమవుతోంది. న్యాయపరంగా ఇంకా కొన్నిచిక్కులు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించి లక్షల రూపాయల్లో పేదలకు నగదును అందచేస్తామంటూ నమ్మబలుకుతోంది. యథేచ్ఛగా స్థలాల విక్రయాలు చేయకుండా న్యాయస్థానం ఆంక్షలు, షరతులు పెడుతోంది. అయితే ప్రజల్లో విశ్వాసం పెంచడానికి విస్తారంగా ఉన్న తనభూములే పథకాలకు పూచీకత్తుగా చూపిస్తోంది సర్కారు.ఆంధ్రప్రదేశ్ లో నిధుల సమీకరణ మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. కేంద్ర, తెలంగాణ ప్రభుత్వాల తరహాలో అపారంగా వనరులు అందుబాటులో లేవు. ఇప్పటికే కొన్ని పథకాలు, చెల్లింపుల నిమిత్తం సర్కారీ ఆస్తులను ప్రభుత్వం తనఖాలు పెట్టింది. విక్రయాలు చేసేందుకు భూములు పెద్ద ఎత్తున లేవు. తెలంగాణలో నిజాం పరిపాలన కారణంగా ప్రభుత్వానికి లక్షల ఎకరాలు దఖలయ్యాయి. ఉమ్మడి ప్రభుత్వ హయాంలో 2010 వ సంవత్సరం వరకూ వివిధ సంస్థలకు కేటాయింపులే తప్ప విక్రయాలు భారీగా చేయలేదు. తెలంగాణ భూములు విక్రయించడంపై టీఆర్ఎస్ ఆందోళనలు, ఉద్యమాలు చేయడంతో ఉమ్మడి పాలకులు ఒకింత సాహసించలేకపోయారు. భూముల విలువ బాగా పెరిగింది. ఇప్పుడు వాటి ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుకునేందుకు టీఆర్ఎస్ సర్కారు ప్రయత్నిస్తోంది. విభజన తర్వాత నవ్యాంధ్రకు ప్రభుత్వ భూములు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అందులోనూ హైదరాబాద్ మాదిరిగా వేల కోట్ల రూపాయలలో ఆదాయమూ తెచ్చిపెట్టేవి కావు. ప్రభుత్వ రంగసంస్థల ఆస్తులు కూడా హైదరాబాద్ లోనే ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ఇంకా పంపిణీ పూర్తి కాలేదు. ఈ కారణాల వల్ల కేంద్రానికి, దాయాది తెలంగాణకు ఉన్న వెసులుబాటు ఏపీకి దక్కడం లేదు. సంక్షేమపద్దులో భూములను అమ్మేయాలని భావిస్తున్నప్పటికీ పెద్ద ఎత్తున నిధులు సమకూరే పరిస్థితులు కనిపించడం లేదు.అయిదేళ్ల కాలానికి అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు శాశ్వత ఆస్తులను కరిగించివేయడంపై మేధావుల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వాలు తమకు లభించే పరిమిత కాలంలో భావితరాలకు అవసరమైన శాశ్వత ప్రగతికి పునాదులు వేయాలి. అంతే తప్ప అప్పుల ఊబిలో ముంచేయడం, తరతరాలుగా వస్తున్న భూమిని ప్రయివేటు వ్యక్తుల ధారాదత్తం చేయడం మంచిది కాదు. భారతదేశంలో సార్వభౌమాధికారం ప్రభుత్వాలది కాదు. పార్లమెంటుకు మాత్రమే అటువంటి అధికారం ఉంటుంది. భూ క్రయవిక్రయాలకు అనుమతులు పార్లమెంటు నుంచి పొందేలా కఠినతరమైన చట్టం రావాలి. రాష్ట్రప్రభుత్వాలకు భూములను లీజులకు ఇచ్చే అధికారం మాత్రమే ఉండాలి. అప్పుడే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలకు భూ వసతి అందుబాటులో ఉంటుంది. ఈ మేరకు కనీస మార్పులు జరగకపోతే సంకుచిత లక్ష్యాలతో కూడిన ప్రభుత్వాలు శాశ్వత వనరులను కనుమరుగు చేసేస్తాయి.

# గుంటూరు పార్లమెంట్ పై గురి...

గుంటూరు, ఆగస్టు28, (న్యూస్ పల్స్)గుంటూరు పార్లమెంట్?.అధికార వైసీపీకి ఆధిక్యం ఉన్న స్థానం. ఈ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్నీ అసెంబ్లీ స్థానాల్లో వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. అయితే గతంలో అధికారంలో చంద్రబాబు, గుంటూరు పరిధిలో ఉన్న అమరావతి ప్రాంతాన్నే రాజధానిగా ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ టీడీపీకి తిరుగుండదని అంతా అనుకున్నారు. కానీ గత ఎన్నికల్లో పరిస్థితి తారుమారైంది. గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 స్థానాల్లో 6 అసెంబ్లీ స్థానాలు వైసీపీనే గెలిచింది. ఇక ఒక్క గుంటూరు వెస్ట్‌లో మాత్రమే టీడీపీ గెలిచింది. అలాగే గుంటూరు ఎంపీ సీటు కూడా స్వల్ప మెజార్టీతో టీడీపీనే గెలుచుకుంది. అయితే గుంటూరు వెస్ట్‌లో గెలిచిన మద్దాలి గిరి సైతం ఇప్పుడు వైసీపీ వైపునకు వెళ్ళిపోయారు. దీంతో పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాలన్నీ వైసీపీ ఖాతాలోనే ఉన్నాయి.ఇక ప్రస్తుతం వైసీపీ అధికారంలో ఉండటంతో ఇక్కడ ఆ పార్టీకి కాస్త ఆధిక్యం ఉంది. ఇటీవల పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ హవానే నడిచింది. అధికారంలో ఉండటం వల్లే వైసీపీ గెలుపు ఇక్కడ సులువు అయ్యింది. కానీ అండర్ కరెంట్‌గా గుంటూరు పార్లమెంట్ పరిధిలో సైకిల్ స్పీడ్ పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే రాజధాని అమరావతి ఇష్యూ ఇప్పుడు కాకపోయినా నెక్ట్స్ సాధారణ ఎన్నికల్లో టీడీపీకి కలిసొస్తుందని అంటున్నారు. పైగా ఈ పార్లమెంట్ పరిధిలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేల పనితీరు కూడా మెరుగ్గా లేదని, అదే సమయంలో టీడీపీ నేతలు బాగానే పుంజుకుంటోన్న పరిస్థితి ఉంది.అసలు అమరావతి ప్రాంతంలో కీలకంగా ఉన్న తాడికొండలో వైసీపీ ఎమ్మెల్యే శ్రీదేవిపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని, రాజధాని అంశమే ఆమెకు షాక్ ఇస్తుందని చెబుతున్నారు. సొంత పార్టీలోనే ఆమెను ఎక్కువ మంది నేతలు టార్గెట్ చేస్తుండడం కూడా ఆమెకు బిగ్ మైనస్ అవుతోంది. మంగళగిరిలో ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డిది అదే పరిస్థితి. విచిత్రం ఏంటంటే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ అంశాలపై అయితే ఆళ్ల పోరాటం చేశారో అవే ఇప్పుడు ఆయనకు మైనస్ అయ్యాయి. రాజధాని మార్పు విషయంలో ఆయన నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పేందుకు కూడా దిక్కూ దివాణం లేకుండా పోయింది.ఇక్కడ నారా లోకేష్‌కు అడ్వాంటేజ్ వస్తుందని విశ్లేషిస్తున్నారు. ఇక ఇటీవలే జైలుకు వెళ్లొచ్చిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకు సానుభూతి పెరిగిందని, పొన్నూరులో ఆయనకు బలం పెరిగిందని, అదే సమయంలో అక్కడ ఉన్న వైసీపీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య ఎఫెక్టివ్‌గా పనిచేయట్లేదని చెబుతున్నారు. పైగా రోశయ్య జనసేనతో పాటు ఓ సామాజిక వర్గం నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఆయనపై తీవ్రంగా వచ్చేశాయి.తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేదలకు కేటాయించిన భూముల విషయంలో భారీగా అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. గుంటూరు వెస్ట్‌లో మద్దాలి గిరి చుట్టూ పార్టీలో మూడు గ్రూపులు ఉన్నాయి. అసలు ఆయన వైసీపీ చెంత ఉన్నా చేయడానికి కూడా ఏం లేదు. ఇక గుంటూరు ఈస్ట్‌లో మహమ్మద్ ముస్తఫా పనితీరు కూడా అంతంత మాత్రమే అని, ప్రత్తిపాడులో హోం మంత్రి సుచరితకు కూడా నియోజకవర్గంలో పట్టు తగ్గుతోంది. పేరుకు ఆమె కీలక శాఖకు మంత్రిగా ఉన్నా నియోజకవర్గంపై పార్టీలోనూ, అభివృద్ధిలోనూ ముద్ర వేయలేకపోతోన్న పరిస్థితి. మొత్తం మీద చూసుకుంటే గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఫ్యాన్ ఎమ్మెల్యేలే సైకిల్ స్పీడ్ పెంచుతున్నారు.

# బొబ్బిలి కోటపై గురి

విజయనగరం, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా రాజకీయాలు బహు పసందుగా ఉంటాయి. వేరు వేరు పార్టీలలో ఉన్నా కూడా నాయకుల మధ్యన తెర వెనక సఖ్యత హ్యాపీగా తాపీగా అలా సాగిపోతూనే ఉంటుంది. విజయనగరం జిల్లా పూసపాటి వారికీ, మంత్రి బొత్స సత్యనారాయణకు మధ్య చక్కని బంధమే ఉందని అంటారు. ఎన్నికల వేళ ఇది మరింతగా పండుతుందని కూడా చెబుతారు. వీక్ క్యాండిడేట్ ని అటూ ఇటూ పెట్టుకుని గెలుస్తారు అని కూడా ప్రచారం అయితే ఉంది. ఇవన్నీ ఉత్త మాటలు అనుకున్నా ఈ మధ్య అశోక్ గజపతి రాజు అంటే ఒంటికాలు మీద లేస్తున్న వైసీపీ సర్కార్ కి కనీసం మాట సాయం కూడా బొత్స సత్యనారాయణ చేయకపోవడాన్ని బట్టి చూస్తే ఈ బంధం బహు గట్టిది అనిపించక మానదు.అశోక్ మీద విమర్శలు చేయాలంటే బొత్స సత్యనారాయణ మాటలకే తడుముకుంటారు అంటారు. ఎందుకంటే విజయనగరం వరకూ అశోక్ దే మాట. గ్రామీణంలో తన హవా అంటూ రాజకీయ గిరులు గీసుకుని కొన్ని దశాబ్దాల పాటు ఈ ఫ్యామిలీలు ఏలాయి. బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ లో ఉన్నపుడు అలా సాగింది కానీ ఇపుడు ఆయన కూడా వైసీపీ లాంటి ప్రాంతీయ పార్టీలో ఉన్నారు. దాంతో సొంత ఒప్పందాలు స్వీయ నిబంధలను పక్కన పెట్టి మరీ అశోక్ మీద దాడి చేయాల్సిందే అంటోంది అధినాయకత్వం. దానికి సరేననలేక మెత్తమెత్తగా అశోక్ మీద బొత్స సత్యనారాయణ బాణాలు వేస్తున్నారు. మా ప్రభుత్వం తప్పు ఏమీ లేదు, పూసపాటి వారి వారసత్వం విషయంలో వచ్చిన గొడవను మా మీద రుద్దితే ఎలా అంటూ అశోక్ ని చైర్మన్ పదవి నుంచి తప్పించడాన్ని బొత్స తనదైన స్టైల్ లో సమర్ధించారు.అదే సమయంలో బొబ్బిలి రాజుల విషయంలో మాత్రం ఎలాంటి మొహమాటాలకూ తావు లేకుండా బొత్స సత్యనారాయణ మాటల తూటాలు పేల్చేస్తారు. బొబ్బిలి వారిదీ సంస్థానమే. వారికి వందల ఏళ్ళ చరిత్ర ఉంది. కానీ బొత్స సత్యనారాయణకు వారితో ఉన్నది రాజకీయ వైరం. పార్టీలు ఎన్ని మారినా ఆయన టార్గెట్ మాత్రం బొబ్బిలి కోట మీదనే ఉంటుంది. అందుకే బొబ్బిలి రాజుల ఇలవేలుపు అయిన వేణుగోపాలస్వామి వారి నగలు కోటలో ఎందుకు ఉండాలి అంటూ లా పాయింట్లు బాగానే లాగుతున్నారు బొత్స సత్యనారాయణ. విజయనగరం రాజుల ఆధీనంలోని మాన్సాస్ ట్రస్ట్ భూముల్లో అవకతవకలు జరిగాయని చెబుతున్నా మాట్లాడని బొత్స బొబ్బిలి రాజులు మాత్రం అవకతవకలకు పాల్పడ్డారని పెద్ద నోరు చేస్తున్నారు.ఈ ద్వంద్వ నీతితో తన స్వీయ ప్రయోజనాలకు చూసుకుంటూ పోతున్న బొత్స సత్యనారాయణ తీరుని వైసీపీ ఒక కంట కనిపెడుతోందని అంటున్నారు. తప్పు ఎక్కడ జరిగినా తప్పే, అందరి గుట్టూ బయటపెడతామని దేవాదాయ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అంటున్నారు. సింహాచలంతో మొదలుపెట్టి విజయనగరం మాన్సాస్ భూముల విషయంలో లోతైన దర్యాప్తు చేస్తామని కూడా స్పష్టంగా చెబుతున్నారు. అదే సమయంలో బొబ్బిలి కోటలో ఉన్న నగలు, విలువైన ఆభరణాలను కూడా దేవస్థానం ఆధీనంలోకి తెస్తామని కూడా ఆయన అంటున్నారు. మొత్తానికి అటూ ఇటూ రాజులు, మధ్యలో బొత్స సత్యనారాయణ లాంటి దళపతులు, పైన వైసీపీ సర్కార్ చెడుగుడు ఇవన్నీ కలసి విజయనగరంలో మరో యుద్ధాన్నే తీసుకువచ్చేలా ఉన్నాయని అంతా అంటున్నారు.

# సీజన్ లో తక్కువగా పులస



రాజమండ్రి, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)ధవళేశ్వరం బ్యారేజి నుంచి సాగరసంగమం వరకు ఉన్న పాయల్లోనే దొరికే చేప. పేరు 'పులస'. ఆ పేరు వింటేనే మాంసాహార ప్రియుల నోట్లో నీరూరుతూంటుంది. వండిన తరువాత ఆ ముక్క పంటికి తగిలితే.. ఆ రుచికి నాలుక వహ్వా అంటుంది. జీవితంలో ఒకసారి పులస రుచి చూస్తే ఏటా లొట్టలేసుకుని తినాలి?సందే.అత్యంత ఖరీదైన డిష్ ఈ పులస చేప. కిలో పులస కావాలంటే ఐదారు వేల రూపాయలు పెట్టాల్సిందే. అయినప్పటికీ 'పుస్తెలు అమ్మి అయినా సరే పులస తినాలి?సందే'నని గోదావరి జిల్లాల్లోని మాంసాహార ప్రియులు అంటారు. 'పులస' నేపథ్యం ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి.పసిఫిక్ మహాసముద్రం ప్రాంతంలోని ఆస్ట్రేలి యా, న్యూజిలాండ్ తదితర దేశాల సముద్ర జలా ల్లో జీవించే ఈ పులసను క్యుఫిడే కుటుంబానికి చెం దిన కార్డేటాగా శాస్త్రవేత్తలు వర్గీకరించారు. పులస ప్రజాతి హిల్సా. జాతి ఇల్సా. ఈ 'ఇల్సా' కాస్తా సముద్రంలో ఉన్నప్పుడు 'విలస'గా.. గోదావరిలోకి ప్రవేశించాక 'పులస'గా మారుతుంది. ఈ చేపలు పునరుత్పత్తి కోసం పసిఫిక్ మహాసముద్రం నుంచి హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం మీదుగా.. సుమారు 11 వేల నాటికల్ మైళ్లు ప్రయాణించి గోదావరిలోకి వలస వస్తాయి. ఇందుకోసం అవి 30 నుంచి 40 రోజుల పాటు జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ఆధారంగా ఏకధాటిగా ప్రయాణిస్తాయి. సైబీరియా పక్షులు, ఆలివ్ రిడ్లే తాబేళ్ల మాది రిగానే.. పులసలు కూడా పునరుత్పత్తి కోసం వేల కిలోమీటర్ల దూరాన్ని అలవోకగా అధిగమించి.. ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గోదావరి నదికి ఎర్రనీరు (వరద) వచ్చే సమయానికి గుడ్లు పెట్టడానికి వలస వస్తాయి. ఆడ, మగ పులసలు గోదావరిలో ఇసుక, గులక రాళ్లు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే సంగమించి గుడ్లు పెడతాయి. ఆ గుడ్లు ఒకటి రెండు రోజుల్లోనే చేప పిల్లలుగా ఎదుగుతాయి. పులస చేప పిల్లలను 'జట్కా' అని పిలుస్తారు. పునరుత్పత్తి పూర్తయ్యాక వచ్చిన సముద్ర మార్గంలోనే సంతానం(జట్కాలు)తో కలిసి తిరిగి వచ్చిన చోటకే వెళ్లిపోతాయి. ఇందుకు మరో నెల రోజులు సమయం పడుతుంది. వీటిల్లో కొన్ని గోదావరిలో వలలకు చిక్కి, మత్స్యకారులకు సిరులు కురిపిస్తాయి. ఇవి ఉభయ గోదావరి జిల్లాల్లోని గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ, వశిష్ట గోదావరి పాయల్లో మాత్రమే లభిస్తాయి.గోదావరికి వరదలు వచ్చే జూలై చివరి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు పులసలు లభిస్తాయి. కొన్ని సార్లు సెప్టెంబర్‌లో కూడా దొరుకుతాయి.. సముద్రం నుంచి గోదావరిలోకి ప్రవేశించాలంటే అవి ఏటికి ఎదురీదుకుంటూ రావాలి?సందే. మహోగ్ర వడితో పరవళ్లు తొక్కే వరద గోదావరికి ఎదురీదడమంటే మాటలు కాదు. అందుకు తగినట్టుగానే పులసలు 100 కిలోమీటర్ల వేగంతో గోదావరికి ఎదురీదుతాయి. గోదావరి జిల్లాల్లో సముద్ర ముఖద్వారం నుంచి గోదావరి నదిలో సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. అంత దూరం అంత వేగంతో ఎదురీదడంతో ఈ చేపల్లో కెమికల్ రియాక్షన్ విపరీతంగా జరిగి దీని కండరాల్లో ప్రోటీన్లు ఉత్పత్తి అవుతాయి. పులసలకు స్వేదగ్రంథులు ఉండవు. మామూలుగా చేపల్లో ఒమేగా?3 పేట్రియాసిడ్స్ (ఆమ్లాలు) ఉంటాయి. కానీ ఈ ఆమ్లాలు పులసల్లో మూడు రెట్లు అధికంగా ఉంటాయని, అందువల్లనే వీటికి మంచి రుచి వస్తుందని చెబుతారు.మాంసాహార ప్రియులు ఎంతగానో ఇష్టపడి తినే ఈ పులసలకు కూడా నకిలీల బెడద తప్పడం లేదు. పులసలపై అవగాహన ఉన్న గోదావరి వాసులు నకిలీ పులసలను సులువుగా గుర్తిస్తున్నారు. గోదావరిలో దొరికే పులస దిగువన చర్మం బంగారు రంగులో మెరుస్తూ ఉంటుంది. అదే ఒడిశా నుంచి వచ్చే నకిలీ పులస చర్మం కొద్దిగా ఎరుపు రంగులో ఉన్నా మెరుపు ఉండదు. కేజీ బేసిన్‌లో చమురు, సహజవాయువు నిక్షేపాల కోసం జరుగుతున్న డ్రిల్లింగ్ కారణంగా జలకాలుష్యం పెరిగిపోవడం వలన గోదావరిలో పులసల రాక తగ్గుతోందని చెబుతున్నారు.

# జనాల్లో ఉండే వారికే టిక్కెట్లు

గుంటూరు, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)చంద్రబాబు చుట్టూ ఒక వలయం ఉంది. వాళ్ళంతా పాతికేళ్ల క్రితం నుంచి బాబుతో ఉంటున్న వారే. ఇంకా చెప్పాలంటే ఎన్టీఆర్ జమానాలోనూ వారే చంద్రబాబు వర్గంలో కనిపిస్తారు. అటువంటి వారంతా ఇపుడూ బాబు భజన బృందంలో ఉన్నారు. వారిని దాటుకుని చంద్రబాబు ముందుకు రాలేకపోతున్నారు. బయటకు చూడలేకపోతున్నారు. మరో వైపు చూస్తే టీడీపీ గత రెండేళ్ళుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. చంద్రబాబు మార్క్ రిపేర్లు ఎన్ని చేసినా కూడా కూడా అసలు కదలిక లేదు. చంద్రబాబు నుంచి ఆదేశాలు జారీ వస్తే దిగివున వున్న వారంతా లైట్ గా తీసుకుంటున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఎవరి సొంత పనులలో వారు ఉన్నారు.కొంతమంది నేతలు అధికార పార్టీకి ఇండైరెక్ట్ గా మద్దతు ఇస్తున్నారు. మరో మూడేళ్ల పాటు జగన్ సర్కార్ ఏపీలో ఉంటుంది. కాబట్టి ఆ ప్రభుత్వానికి అనుకూలంగా నడచుకుంటే తమ వ్యాపార వ్యవహారాలు అన్నీ కూడా చక్కబెట్టుకోవచ్చు అన్న అతి తెలివితో వ్యవహరిస్తున్నారు. వీరంతా కూడా టీడీపీలోనే ఉంటారట. కానీ ఇపుడు పార్టీ కోసం బయటకు వచ్చి అసలు పోరాడరట. ఎన్నికలు ఏడాది ఉన్నాయి అనగానే అపుడే బయటకు వస్తారట. ఎటూ తాము అన్ని రకాలుగా బలవంతులం కాబట్టి చంద్రబాబు ఖచ్చితంగా టికెట్లు తమకే ఇస్తారు అన్న ధీమా అయితే వీరిలో బాగా ఉంది.మరి ఇపుడు పోరాటం చేయకపోతే అపుడు టికెట్ తెచ్చుకుని ఏం లాభం అంటే అయిదేళ్ల తరువాత జగన్ సర్కార్ మీద వచ్చే యాంటీ వేవ్ లో తాము గెలుస్తామని చెబుతున్నారు. అలా యాంటీ వేవ్ రాకపోతే సంగతేంటి అంటే ? అలాగే జరుగుతుంది అని కూడా లెక్కలు చెబుతున్నారు. సరే కానీ వీరంతా తాము పార్టీని వదలరు. అలాగని పట్టించుకోరు. అధికార పార్టీ మీద జనాలకు మొత్తితే తామే దిక్కు అన్నట్లుగా ఉంటారు. పైగా చంద్రబాబుకు తామంటే నమ్మకం కాబట్టి తమకే టికెట్లు వస్తాయని కూడా చెప్పుకుంటున్నారు. మరి ఇలాంటి నాయకులను తప్పించే సత్తా అధినాయకత్వానికి ఉందా ? అన్నదే ఇక్కడ ప్రశ్న. నిత్యం జనాలలో ఉంటే యువ తరాన్ని తీసుకుని వచ్చి మూడేళ్ళ ముందు నుంచే అధికార పార్టీ మీద పోరాటం చేసే దిశగా పార్టీని కదిలించే స్థితి ఉందా ? అన్నది కూడా తమ్ముళ్ల ప్రశ్నగా ఉంది.ఒకవేళ అలా అనుకున్నా.. ఇపుడు కొత్త వారి చేత జూనియర్ల చేత పోరాటాలు చేయించి తీరా ఎన్నికల వేళకు మాత్రం సీనియర్లకే టిక్కెట్లు కట్టబెడితే మాత్రం ఈసారి తమ దెబ్బేంటో చూపిస్తామని కూడా పార్టీలో నవతరం చెప్పేస్తున్నారు. ఈ రోజు ఎవరైతే జనాల్లో ఉంటారో వారే రేపటి నేతలు, టికెట్లు కూడా వారికే ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు. మరి చంద్రబాబు వేసుకునే లెక్కలకు ఈ డిమాండ్లు సరిపోతాయా ? ఆయన ఎంతసేపూ అంగబలం, అర్థబలం, సీనియార్టీ లాంటి సమీకరణలతో సతమతమవుతారు. అదే జరిగితే మాత్రం టీడీపీని జనాలు తాము మెచ్చి గెలిపించాలేమో కానీ సొంతంగా పార్టీ అయితే పోరులో నిలబడేది కలబడేది ఏదీ ఉండదు అంటున్నారు తమ్ముళ్ళు. ఇక చంద్రబాబు కూడా వైసీపీపై యాంటీ వస్తే జనాలకు మాకు ఓట్లేస్తారు.. మేం నిలబెట్టినోళ్లనే గెలిపిస్తారన్న భ్రమల్లో నుంచి బయటకు వచ్చిన పరిస్థితి కూడా లేదు.

# పిడుగురాళ్లలో పాములతో సావాసం

గుంటూరు, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)పట్టణానికి చివరిగా ఉండటమో, అధికారులు శీతకన్ను వేయడమో తెలియదు కానీ ఆ ప్రాంత వాసులు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయారు. చీకటి పడితే చాలు దీపాల వెలుగులో నిత్యం పాములతో సహవాసం చేయాల్సిన పరిస్థితి. ఒక్క సిసి రోడ్డు కూడా లేకపోవడంతో వర్షకాల సమయంలో వీధులలో నడిచేందుకు ఇబ్బందిగా ఉందని వీధుల నిండా కొండ రాళ్ళు ఉన్నాయని కనీసం వాటిని సరిచేయాలని అధికారులకు ఎన్ని సార్లు మెరపెట్టుకున్నా ఉపయెగం లేకుండా పోయిందని కాలనీ వాసులు వాపోతున్నారు. గత సంవత్సరం క్రితం వీధి దీపాలు వేసినప్పటికి అవి కూడా మూడు లేదా నాలుగు నెలలు పని చేశాయని మళ్ళీ అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. రాత్రి సమయాల్లో కొండ ప్రాంతం కావటంతో పెద్ద పెద్ద సర్పాలు విష జీవులు ఇండ్లలోకి వస్తున్నాయిని తెలుపుతున్నారు. పిడుగురాళ్ళ పట్టణంలోని 5, 11వార్డులలో భాగంగా ఉన్న సుందరయ్య కాలనీలో సుమారు 200 కుటుంబాలు రోజు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది సున్నం పరిశ్రమలో పనిచేసే కార్మికులే. పది సంవత్సరాల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, పది సంవత్సరాలుగా పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగిన తమకు న్యాయం జరగలేదని వారు చెబుతున్నారు. ఎన్నికల వేళ పట్టాలు ఇప్పిస్తామంటూ హామీ ఇచ్చిన నాయుకులు ఇప్పుడు పత్తా లేకుండా పోయా రు. సేవా సంస్థల పుణ్యామా అని బోరు పంపు లు ద్వారా నీటి సరఫ రా జరుగు తున్నా వేసవి సమయంలో మాత్రం బోరు పంపులు ఎండిపోయి నీటి సమస్య తీవ్రతరం అవుతుందని తెలుపుతున్నారు. కనీసం అంగన్‌వాడీ, వైద్య సదుపాయం కూడా లేకపోవడం వల్ల గర్భిణులకు, చిన్న పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం సకాలంలో అందడంలేదని చెబుతున్నారు. రెండు రోజుల కిందట నా మనవడు ఇంటి బయట ఆడుకుంటుండగా పాము కనబటంతో భయపడి ఏడుస్తున్నాడు. ఇంటిలో నుండి బయటకు రాగా పెద్ద పాము ఆరుబయట ఉండటం చూసి పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొ రుగు వచ్చి దానిని తరిమి వేశారు. పాముని చూసి భయపడటంతో నా మనవడుకి జ్వరం వచ్చింది. ఇలా పాములు నిత్యం ఈ ప్రాంతంలో తిరుగుతు ంటాయి. రాత్రిళ్ళు అయితే మరింత దారుణంగా ఉంటుంది

# రాజమండ్రికి మాగంటి గుడ్ బై

రాజమండ్రి, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)మాగంటి మురళి మోహన్ నటుడు, నిర్మాత టాలీవుడ్ పెద్ద, రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త కూడా. ఇలా బహుముఖాలుగా రాణించిన మురళి మోహన్ తెలుగుదేశం పార్టీలో గతంలో చాలా చురుగ్గా ఉండేవారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు 2009, 2014 పార్లమెంట్ ఎన్నికల టికెట్ ను చంద్రబాబు పిలిచి మరీ ఇచ్చారు. 2019 లో ఆయన కోడలు మాగంటి రూపకి టికెట్ ఇచ్చి మురళి మోహన్ రాజకీయాల్లో ఉన్నా లేకున్నా ఆయన కుటుంబాన్ని పార్టీ ప్రోత్సహిస్తుందనే సంకేతాలు ఇచ్చారు బాబు.మూడు సార్లు రాజమండ్రి పార్లమెంట్ టికెట్ దక్కించుకుని ఒకసారి గెలిచి రెండు సార్లు ఓటమి పాలైన మురళి మోహన్ కుటుంబం ఇకపై రాజకీయాలకు గుడ్ బై కొట్టేయాలనే నిర్ణయం తీసుకోవడం చర్చనీయంగా మారింది. రాజమండ్రి పార్లమెంట్ స్థానం నుంచి తొలిసారి పోటీ చేసినప్పుడు మురళి మోహన్ ఓటమి పాలయ్యారు. సీనియర్ రాజకీయవేత్త ఉండవల్లి అరుణ కుమార్ చేతిలో పరాజయం పొందారు. హీరో కృష్ణం రాజు సైతం ఉండవల్లి చేతిలో ఆ ఎన్నికల్లో చతికిల పడి క్రియాశీలక రాజకీయాల్లో లేకుండా పోయారు. ఆ ఓటమి తరువాత మురళి మోహన్ తరువాతి ఎన్నికల్లో గెలవడానికి ఐదేళ్ళు రాజమండ్రిని అంటిపెట్టుకుని ప్రజలకు దగ్గర అయ్యారు. క్యాడర్ తో బాగా టచ్ లో ఉండేవారు. తాను స్థానికంగానే ఉంటానని హైదరాబాద్ లో ఉండనని ప్రజలను నమ్మించేందుకు స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించారు మురళి మోహన్.అయితే గత ఎన్నికల్లో ఆయన కోడలు రూప వైసిపి అభ్యర్ధి మార్గాని భరత్ రామ్ పై ఘోరంగా ఓటమి పాలయ్యారు.కట్ చేస్తే ఆ తరువాత ఆయన రాజమండ్రి రావడమే మానేశారు. గత ఎన్నికల్లో ఆర్ధికంగా గట్టి దెబ్బ తగలడం అమరావతిలో భూముల లావాదేవీలు వ్యాపారాలపై జగన్ సర్కార్ మోపిన ఉక్కుపాదంతో మురళి మోహన్ కి గట్టి దెబ్బలే తగిలినట్లు తెలుస్తుంది. దాంతో కొంతకాలం ఆగి ఎంతో ఇష్టంగా కట్టుకున్న రాజమండ్రిలోని బిల్డింగ్ ను అమ్మేసి దుకాణం పూర్తిగా బంద్ చేసేసారు మురళి మోహన్. ఈ పరిణామం టిడిపి లో పెద్ద చర్చకు తెరతీసింది. నాన్ లోకల్ వ్యక్తులకు చంద్రబాబు టికెట్లు ఇవ్వడం అందులోను పార్లమెంట్ స్థానం ఎప్పుడు తన సామాజిక వర్గం వారికి, ఆర్ధిక పరిపుష్టి ఉన్న వారికి ఇవ్వడం వల్లే పార్టీకి పరాభవాలు తరచూ పలకరిస్తున్నాయని పార్టీ వర్గాలు వాపోతున్నాయి.పదవులు వచ్చినా లేకపోయినా పార్టీ కోసం రక్తం చిందించే వారిని పక్కన పెడితే మాగంటి మురళీమోహన్ తీరులాగే ఉంటుందన్న విమర్శలు ఇటీవల బాగా పెరిగాయి.

# విద్యారంగంపై జగన్ దృష్టి

## సర్కారీ స్కూళ్ల వైపు పరుగులు

విజయవాడ, ఆగస్టు 28, (న్యూస్ పల్స్)జగన్ ఏం చదివారు అని విపక్ష టీడీపీ ఎన్నో సార్లు ఎగతాళీ చేసింది. ఆయన గురించి చులకనగా మాట్లాడింది. అయితే జగన్ కి చదువు విలువ తెలుసు అనడానికి ఆయన రెండున్నరేళ్ల పాలన కళ్ళ ముందు కనిపిస్తోంది. నాడు నేడు పేరిట ఆయన విద్యారంగానికి వేల కోట్ల బడ్జెట్ కేటాయించి అభివృద్ధి ఏంటి అన్నది చూపిస్తున్నారు. మరో వైపు చూస్తే ఏపీలో విద్యా విప్లవమే తీసుకువచ్చారని చెప్పాలి. అంతే కాదు చదువుకొనడమే ఇప్పటిదాకా చూసిన జనాలకు ఫీజుల బాధ లేకుండా చదివిస్తున్న ఘనత కూడా జగన్ దే అని చెప్పాలి.ఏపీలో జగన్ విద్యారంగంపై చూపుతున్న శ్రద్ధ, ఆయన అమలు చేస్తున్న కార్యక్రమాలను చూసి దేశంలోని మిగిలిన రాష్ట్రాలు ఫాలో కావాల్సిందే అంటారు. ఇప్పటికే తెలంగాణా సర్కార్ ఏపీలో అమలవుతున్న నాడు నేడు ప్రోగ్రాం గురించి తెలుసుకుని సాఫ్ట్ వేర్ ని కూడా అడిగి మరీ తీసుకెళ్ళింది. ఇక ఏపీలో అమ్మ ఒడి పేరిట జగన్ పేదలకు పెద్ద ఎత్తున ఆర్ధిక భరోసా కల్పిస్తున్నారు. అదే విధంగా విద్యా కిట్లు ఇస్తూ బడుగులకు పైసా కూడా భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. దానికి తోడు అన్నట్లు ఇపుడు ఫీజుల విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం తొలిసారిగా కచ్చితమైన నిబంధనలు పెట్టడమే కాదు, ఎంత వసూలుచేయలన్నది కూడా నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఏపీలోని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్నారు.విద్యా సంస్థల పేరిట వ్యాపారం చేసేవారికి జగన్ సర్కార్ గట్టి ఝలక్ ఇచ్చేసింది. ఫీజులను ఇష్టం వచ్చినట్లుగా ఇన్నాళ్ళూ వసూల్ చేస్తున్నారు. దీనికి ఒక తార్కిక విధానం అంటూ ఏమీ లేదు. ఇక్కడ బేరాలు కూడా అసలు లేవు. ఫీజు ఎవరికి తోచిన విధంగా వారు యధేచ్ఛగా వసూల్ చేస్తూ పోయారు. అదేమని అడిగినా ప్రభుత్వం నుంచి కూడా నాడు స్పందన ఉండేది కాదు. కానీ ఇపుడు జగన్ రూల్స్ మొత్తం మార్చేశారు. ఫీజులు కచ్చితంగా ఇంత మాత్రమే వసూలు చేయలంటూ గట్టి నిబంధనలు విధించారు. అంతే కాదు కళాశాలకు కూడా ఫీజులను తొలిసారిగా నిర్ధారించడం విశేషం. మూడు కేటగిరీలుగా వీటిని విభజించి మరీ సమంజసమైన విధానాన్నే ప్రభుత్వం తీసుకువచ్చింది. హాస్టల్ లో ఉన్న వారికి ఫీజులను కూడా ప్రభుత్వమే నిర్ధారించింది. అలాగే స్కూల్ బస్సుకు ఎంత వసూలు చేయాలన్నది కూడా తెలియచేస్తూ వాటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.ఏపీలో చేసిన విధంగా దేశంలో కూడా ఇంతవరకూ జరగలేదు. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలకు కొత్త రూపు తెస్తూ అక్కడ హాజరుని పెంచుతున్న జగన్ ప్రభుత్వం మరో వైపు ప్రైవేట్ విద్యా సంస్థల మీద కొరఢా ఝులిపించింది. దీని వల్ల మధ్యతరగతి వర్గాలు కూడా అతి పెద్ద ఊరటను పొందుతున్నాయి. నిజానికి ఫీజుల భారం వల్ల తల తాకట్టు పెట్టి అయినా పిల్లలను చదివించాలని పడుతున్న ఆరాటం ఎన్నో కుటుంబాలను గుల్లను చేస్తోంది. ఏది ఏమైనా ఏపీలో ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శమని విద్యావేత్తలు అంటున్నారు. ఇదే తీరున అంతా అమలు చేస్తే దేశంలో చదువుకొనే రోజులు పోయి చదువుకునే రోజులు వస్తాయని అంటున్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో తనిఖీలు

నరసాపురం ఆగస్టు 28, (న్యూస్ పల్స్)పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో చలానాలు మార్ఫింగ్ లకు పాల్పడిన దస్తావేజు లేఖరుల పై కేసులు నమోదు చేయనున్నామని జిల్లా రిజిస్టర్ జానకీదేవి తెలిపారు,భీమవరం పరిధిలోని ఆరు సబ్ రిజిస్టర్ కార్యాలయాలో రూ.12.30 లక్షలు అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు అత్యధికంగా ఆచంట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి జరిగిందన్నారు. ముందుగా విచారణ, ఆ తర్వాత రికవరీ మూడో దశలో కేసులు నమోదు చేస్తామన్నారు ఇప్పటివరకు అవినీతి జరిగిన సొమ్ములో 4.11 లక్షలు రికవరీ చేశామన్నారు నరసాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏడు చలనాలలో రూ 1.28 లక్షలు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు ఈ చలనాలు రెండు మార్పుంగ్ లు జరిగినట్లు ప్రాథమిక విచారణలో బయటపడిందన్నారు ప్రభుత్వాన్ని మోసం చేసిన లేఖర్లు పై కేసులు నమోదు చేయనున్నట్లు ఆమె తెలిపారు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నాన్ లే అవుట్ లు రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ చేస్తే సబ్ రిజిస్టర్ లపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు నరసాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు

## చీటింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్

అనంతపురం ఆగస్టు 28, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా పెనుకొండ మండలం అమ్మ వారి పల్లి వద్ద అమ్ము ప్రియా ట్రావెల్స్ చీటింగ్ కేసులో ముగ్గురు ముద్దాయిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను వెల్లడించారు. డిఎస్పి రమ్య మాట్లాడుతూ అమ్మ వారి పల్లి వద్ద అమ్ము ప్రియ ట్రావెల్స్ ఏర్పాటుచేసి కార్లు అద్దెకు తీసుకుంటామని ప్రకటనలు ఇచ్చి పలు మోసాలకు పాల్పడిన మడకశిర మండలం గుడిబండ గ్రామానికి చెందిన వెంకటేశులు, మహేంద్ర, అంజనప్పలను అరెస్టు చేసి వారి వద్ద నుండి నగదు రూ. 5.25 లక్షలు , 70 గ్రాముల బంగారం, 22 గ్రాముల వెండి మూడు సెల్ఫోన్లు , ఒక ల్యాప్ టాప్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## శ్రీ శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

నెల్లూరు ఆగస్టు 28, (న్యూస్ పల్స్)నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యకార్యక్రమాలకు కుటుంబసమేతంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజలకు ఇలవేల్పుగా ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే గా తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహాయసహకారాలు అందించిన దాతలకు, ఆలయ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్ కి, ధర్మకర్తమండలి సభ్యులకు మరియు ఆలయ అధికారులకు అభినందనలు తెలియజేశారు.నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తూన్నటువంటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఆలయ చైర్మన్ మరియు సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయడైరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర రావు, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఛైర్మెన్ యేసు నాయుడు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసులు రెడ్డి, దర్మకర్తమండలి సభ్యులు, వైసీపీ నాయకులు మిద్దె మురళీ కృష్ణా యాదవ్, హరిబాబు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలెం సుధీర్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు అబుబకర్,కుమార్ హరి కుమార్, విజయ లక్ష్మి, సర్వేపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా సేవా పురస్కారాలు 2021

నెల్లూరు జేడీ ఫౌండేషన్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా సేవ పురస్కారాల ప్రధానం 2021 కార్యక్రమం స్థానిక పురమందిరం లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు, మాజీ మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మరియు తెలుగు భాషా పితామహుడు స్వర్గీయ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని జెడి ఫౌండేషన్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా సేవా పురస్కారాల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జెడి ఫౌండేషన్ కన్వీనర్ అరుణ కు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మురళీమోహన్ రాజులకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తు తరాలకు తెలుగు భాషను అందించాలంటే ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించడం హర్షణీయమన్నారు. తొలుత తెలుగు భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమం అనంతరం అతిథులతో కలిసి నిర్వాహకులు అరుణ మరియు మురళీ మోహన్ రాజు లు సన్మాన గ్రహీతలకు ఘన సన్మానం నిర్వహించారు. అందులో భాగంగానే కరోనా వైరస్ నేపథ్యంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుర్వేద మందులు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న కృష్ణపట్నం వాస్తవ్యులు బొనిగి ఆనందయ్య ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత లైన కవులు, రచయితలు లక్ష్మీ మైధిలి, షేక్ పర్వీన్, వెంకట శేషగిరిరావు, మోహన్ రాజు, మనోరమ, రోజా రాణి, సులోచన తదితరులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి సంపత్ రాజ్, మీడియా ఇన్చార్జి జలదంకి వెంకటేశ్వర్లు మరియు కవులు రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపురం లో అగ్నిప్రమాదం... తండ్రీకొడుకులు సజీవదహనం

ఏలూరు ఆగస్టు 28, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలంలో విషాదం నెలకొంది. శుక్రవారం అర్థరాత్రి ఓ ఇంట్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమారుడు(5) మంటల్లో సజీవదహనం అయ్యారు. పీఎం లంకలో ఘటన జరిగింది. ఘటనకు గల కారణం గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నను హతమార్చిన తమ్ముడు

అనంతపురం ఆగస్టు 28, (న్యూస్ పల్స్)భార్యను వేధిస్తున్నాడన్న కారణంతో అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన అనంతపురం జిల్లా గుత్తి మండలం బసినేపల్లిలో చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా గుత్తి మండలం బసినేపల్లి చంద్ర,రామలక్ష్మి దంపతులకు దేవేంద్ర ,శీను ,రాజు అను ముగ్గరు కుమారులు ఉన్నారు. వీరిలో రెండవ కుమారుడు శీను రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు...అయితే దేవేంద్రకు ఇంకా పెళ్లి అవ్వకపోవడంతో శీను భార్యను దేవేంద్ర వేధిస్తున్నాడంటూ భార్య శీనుతో చెప్పింది. దీంతో ఆగ్రహానికి లోనైన శీను అర్థరాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న దేవేంద్రను ఇనుప గఢారతో విచక్షణ రహితంగా కొట్టాడు..దేవేంద్ర అరుపులకు కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దేవేంద్రను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రాణాలు పొయ్యాయాని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని డాగ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించి శీనును అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.

# బ్యాంక్ లో చోరీకి యత్నం

నిర్మల్ ఆగస్టు 28, (న్యూస్ పల్స్)నిర్మల్ జిల్లా తానూరు మండలం బెల్తారోడా గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో చోరీకి యత్నం జరిగింది. రాత్రి 3 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. బ్యాంక్ షటర్ తాళాలు పగల గొట్టి షెటర్ పైకి ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు ,బ్యాంక్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# టీడీపీ నేతల గృహనిర్బంధం

కడప ఆగస్టు 28, (న్యూస్ పల్స్)నిరసనల నేపథ్యంలో జిల్లాలో టీడీపీ నేతలను పోలీసులుహౌస్ అరెస్టులు చేసారు. పులివెందులలో టీడీపీ ఎమ్మెల్సీ బిటెక్ రవిని పోలీసులు ఇంట్లోనే వుంచేసారు. బయటకు రాకుండా ఇంటి వద్ద మోహరించారు. పులివెందుల వరకూ ఎనిమిది చెక్ పోస్టులు ఏర్పాటు చేసారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ నిరసనకు పిలుపునిచ్చారు. పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ నుంచి పూలంగళ్ళ సర్కిల్ వరకు నిరసన ర్యాలీకి బీటెక్ రవి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎక్కడి నేతలను అక్కడికక్కడే అరెస్ట్ లు చేసారు.

# జర్నలిస్టులు అందరూ ఆరోగ్యంగా ఉండాలి

## తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

## సమాచార శాఖ డిడి జయమ్మ

కర్నూలు ఆగస్టు 28ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తున్న పత్రికా విలేకరులు నిత్యం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సమాచార పౌర సంబంధాల శాఖ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ కాపుజయమ్మ ఆకాంక్షించారు. నిత్యం సమాచార సేకరణలో ఎంతో ఒత్తి డిని ఎదుర్కొంటున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తరచు వైద్య పరీక్షలు చేయించుకోవడం వారి ఆరోగ్యానికి మంచిదని ఆమె సూచించారు .శనివారం కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో కర్నూలు సమాచార పౌర సంబంధాల శాఖ ఆవరణంలో ఏర్పాటుచేసిన జర్నలిస్టుల ఉచిత వైద్య శిబి రాన్ని ఆమె సందర్శించి , వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బందిని, జర్నలిస్టు సంఘాల నాయకులను ఆమె అభినందించారు. జీతభత్యాలు లేకుండా సమాజ సేవ చేస్తున్న పత్రికా విలేకరులు అనునిత్యం తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని కోరారు . జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఉచితంగా షుగర్, బీపీ ,2 డీఎకో ,ఈసీజీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాచార సేకరణలో పోటీపడే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తమ ఆరోగ్య పరిరక్షణలో కూడా పోటీపడి మరీ జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. జర్నలిస్టులుఆరోగ్య ఆరోగ్యవంతంగా ఉంటే సమాజాన్ని కూడా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతా రని ఆమె అభిప్రాయపడ్డారు. 2500 రూపాయలు విలువ చేసే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కృషిచేసిన జర్నలిస్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు టీ.విజయ్ ,కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు జర్నలిస్టు పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు టీ. విజయ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జర్నలిస్టు మిత్రులు, కిమ్స్ వైద్య సిబ్బంది కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాప్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, కిమ్స్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాజ కుమార్ కిమ్స్ వైద్య సిబ్బంది చాముండేశ్వరి ,సంతోషి ,రాజేష్ ,దివాకర్ ,జర్నలిస్టులు ఇస్మాయిల్ , టీజి ప్రసాద్, ఉత్తేజిత చంద్రశేఖర్ ,సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వంద మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# లోకాయుక్త కార్యాలయం ప్రారంభం

కర్నూలు ఆగస్టు 28, (న్యూస్ పల్స్)స్థానిక ఏపీ స్టేట్ గెస్ట్ హౌస్ రూమ్ నెంబర్-3లో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ కార్యాలయాన్ని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డి , జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ లోకాయుక్త సంస్థ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ మరియు రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ (ఆసరా మరియు సంక్షేమం) శ్రీనివాసులు, , ఎస్పీ సి. హెచ్. సుధీర్ కుమార్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ లోకాయుక్త సంస్థ సెక్రటరీ అమరేందర్ రెడ్డి, , డిప్యూటీ రిజిస్ట్రార్ పోలయ్య, , డి.ఆర్.ఓ పుల్లయ్య, కర్నూల్ ఆర్.డి.ఓ హరిప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు, తదితరులు పాల్గోన్నారు.

తరువాత తమ గ్రామంలో ఉన్న లక్ష్మినారాయణ స్వామి గుడిని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోకి విలీనం చేసుకోవాలని కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన ఆరేపల్లి వరలక్ష్మమ్మ అనే వృద్ధురాలు లోకాయుక్తకు మొట్టమొదటి సమస్యను విన్నవిస్తూ వినతిపత్రాన్ని అందచేసారు.

# ధరలు తగ్గాలి అంటే జగన్ దిగి పోవాలి

## పాలకుర్తి తిక్కరెడ్డి

కౌతాళం ఆగస్టు 28, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో ధరలు తగ్గాలి అంటే జగన్ మోహన్ రెడ్డి దిగి పోవాలని మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు అన్నారు వారు రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలకు నిరసనగా తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు మంత్రాలయం నియోజకవర్గం లోని మంత్రాలయం మండలం కన్వీనర్ పన్నాగ వెంకటేషప్ప స్వామి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ ఆఫీసు నుండి రాఘవేంద్ర స్వామి సర్కిల్ వరకు ర్యాలీ చేస్తూ నిరసన లో భాగంగా పాలకుర్తి తిక్కరెడ్డి గారు మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు ప్రతిపక్షంలో పాదయాత్ర లో పెట్రోల్ డీజిల్ పై వ్యాట్ రద్దు చేస్తానన్నాడు నేడు పెట్రోల్ పై వ్యాట్ 31.50%నుండి35.20%కు డీజిల్ పై వ్యాట్ 22.25%నుండి27%కు పెంచారు వీటికి అదనంగా డెవలప్మెంట్ సెస్ రోడ్డు సెస్ ల పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచాడు అలాగే వంటి గ్యాస్ ధర విపరీతంగా పెరిగి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు అలాగే జగన్ పాలనలో ప్రజలు పై పన్నుల భారం ఎక్కువ పడుతుంది అని కరోనాతో ఆదాయం లేక ప్రజలు అల్లాడుతుంటే ప్రజలు పై ఆ పన్ను ఈ పన్ను వేయడం ఎంతవరకు న్యాయం అని వారు అన్నారు రాష్ట్రంలో నిత్యావసర సరుకులు నుండి అని వస్తువులు ధరలు పెరిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు పాదయాత్ర లో ఇచ్చిన మాట ప్రకారము జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేయడం లేదు అని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు పరిపాలన లో విఫలం అయ్యాడు అని వారు అన్నారు జగన్ మోహన్ రెడ్డి గారు ప్రజలు మద్య కు రాకుండ ఎక్కడ నుండి పరిపాలన చేస్తాడో ప్రజలు గమనిస్తూ వున్నారు ముఖ్యమంత్రి గారు ప్రజలోకి వచ్చి పరిపాలన చేయాలని అప్పుడే సమస్యలు తెలుస్తుంది అని వారు అన్నారు అలాగే ధరలు తగ్గాలి జగన్ పోవాలి అని నినాదాలు చేస్తూ బారి ఎత్తుగా నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గారు రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి గారు మంత్రాలయం లీగల్ సెల్ అధ్యక్షులు బాబురావు మంత్రాలయం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు సుదీర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, ముత్తు రెడ్డి ,జిల్లా నాయకులు నాడిగేని అయ్యన్న, కోట్రేష్ గౌడ్, చావిడి వెంకటేష్ , గోపాల్ రెడ్డి , పల్లెపాడు రామిరెడ్డి, పెద్ద కడూబురు మండలం కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న, బూదురు మల్లికార్జున రెడ్డి ,జిల్లా తెలుగు యువత నాయకులు జ్ఞానేష్, మైనార్టీ అధ్యక్షులు టిపుసుల్తన్, జిల్లా కార్యదర్శి రహిమన్ , యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి లు సల్మాన్ రాజు, యోబు యోసేపు మంత్రాలయం యస్ సి సెల్ అధ్యక్షులు బోగ్గల నరసన్న చిన్న భూంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు చిలకలడోన హనుమంతు సూగురు నాగేష్ చితలగేని నర్సిరెడ్డి డిలర్ నర్సన్న రణ తిక్కన్న జనార్ధన్ సాతునూరు ఉలిగయ్య వెంకటేష్ లక్ష్మీకాంత్ గోపాల్ తాయన్న వగరూరు రామిరెడ్డి అబ్దుల్ మేకల నరసింహులు ప్రభాకర్ రెడ్డి ఉరుకుంద సర్పంచ్ ప్రభాకర్ బెళగల్ సర్పంచ్ రామయ్య బసవలింగప్ప మాలపల్లి భీమన్న లక్ష్మన్న తెలుగు యువత కృష్ణా నాగేష్ విజయ్ చిదనంద హనుమన్న లింగప్ప నిలకఠ రామకృష్ణ మారేష్ వీరారెడ్డి హనుమంతు అంజినిరెడ్డి గుండేష్ ఉసేని రాజశేఖర్ రెడ్డి దొడ్డి గోపాల్ రంగారెడ్డి ఉరుకుంద ఉసేని బసవరాజు నాలుగు మండలాలు నాయకులు అన్ని గ్రామాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న చంచల్ గూడా జైలుకు తరలింపు

సికింద్రాబాద్ ఆగస్టు 28, (న్యూస్ పల్స్)సికింద్రాబాద్ కోర్టు శనివారం నాడు తీన్మార్ మల్లన్నకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఐపీసీ 306, 511 సెక్షన్స్ పెట్టడం పై తీన్మార్ మల్లన్న తరుపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. పిర్యాదుదారుడు ఎలాంటి సూసైడ్ అట్టెంట్ చేయలేదని కోర్ట్ దృష్టికి తీసుకెళ్లారు. దాన్ని పరిశీలిస్తామని కో?ర్టు వెల్లడించింది. 7 రోజుల పాటు కస్టడీ కావలని చిలకలగూడా పోలీసులు కోరారు. నిందితుడి తరపు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్నను చంచల్ గూడ జైల్ కి తరలించారు. ఈ నేపధ్యంలో సికింద్రాబాద్ కోర్టు సముదాయంలో పోలీసులు భారీగా మోహరించారు. బారీ గేట్లు ఏర్పాటు చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు.

# దండికుప్పంలో ఏనుగుల హల్ చల్

చిత్తూరు చిత్తూరు జిల్లా వి.కోట మండలం దండికుప్పంలో పంటపొలాలపై ఏనుగుల స్వైరవిహారం చేసాయి. 22 ఏనుగుల గుంపు అడవి నుండి వరి పైరులోకి చొరపడింది. దాంతో పది ఎకరాల్లో పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఆటవీశాఖ, రెవిన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. రాత్రి 8 గంటలు దాటాక పొలాల్లో ఏనుగులు కనిపించడంతో రైతులు భయంతో వాటిని దారి మళ్ళించేందుకు ప్రయత్నించారు. రాత్రి చీకట్లో వర్షం హోరున కురవడంతో వాటిని దారి మళ్ళించ లేక అవి తిరగబడటంతో చేసేది లేక రైతులు నిస్సహాయులుగా వెనుతిరిగారు. దీంతో ఏనుగులు సుబ్రమణ్యం, కుమార్.. మహమ్మద్.. అనే రైతులకు చెందిన వరిపైరుతో పాటు పశుగ్రాసం, రాగి పైరు ఇతర పంటలన్నీ పూర్తిగా నాశనం చేసాయి. గత నెలరోజులుగా ఏనుగులు తరచూ పంట పొలాల్లోనికి వస్తుండటంతో వాటిని దారి మళ్ళించ మని అటవీ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారుగున్న ఏనుగులు గుంపులో ఉండటంతో అవి తిరగబడుతూ.. ఘీకరిస్తున్నాయి. రాత్రి వానలో గజరాజులు.. బావిలో దిగి జలకాలాడి సేదతీరాయి.

# పాలకొల్లులో టీడీపీ ర్యాలీ

పాలకొల్లు ఆగస్టు 28, (న్యూస్ పల్స్)పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ నుండి ట్రాక్టర్ను- రైతులు, ఆటోను డ్రైవర్లు తాళ్లతో లాగుతూ, బైక్ను ఫ్లాట్ రిక్షా పై ఎక్కించి తొక్కుతూ,పెళ్లి కారును, లారీని రెండెడ్ల బళ్లతో లాగుతూ జరుగుతున్న నిరసన ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సి అంగర రామ్మోహన్ తదితరులు పాల్గోన్నారు. కరోనా కష్టకాలంలో పెట్రోల్, డీజిల్ పై అడ్డగోలుగా డెవలప్మెంట్ సెస్సు, రోడ్డు సెస్సు పెంచుతూ చీకటి జీవోలు ఇచ్చారు. దేశంలో అన్ని రాష్ట్రాలు వ్యాట్ ను తగ్గించి ప్రజలపై భారం తగ్గించే పనిలో ఉంటే, జగన్ మాత్రం ధరలు పెంచుతూ రికార్డులు సృష్టిస్తున్నారు.

# పంటకాలువలో ట్రాక్టర్ బోల్తా?ఇద్దరు మృతి

గుంటూరు గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామ శివారులో పంట కాలువలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో సంఘటనా స్థలంలోనే ఇద్దరు వలస కూలీలు మృతి.మృతుల పేర్లు బానావత్ బాలు 45 ఆంగోతు బొగ్గు 40. వీరు గత కొంత కాలంగా నల్గొండ జిల్లా నుండి వలస వచ్చి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు దండమూడి మల్లేశ్వరరావు తన పొలంలో ఎరువులు జల్లేందుకు తన ట్రాక్టర్ పై కూలీలను వెంటపెట్టుకొని వెళ్లుచుండగా కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు డొంక గుంతలమయం కావడంతో ప్రమాదం సంబవించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రొకలైనర్ ద్వారా ట్రాక్టర్ తొలగించి మృత దేహాలను వెలికి తీశారు. ఘటన స్థలంలో కుటుంబసభ్యుల రోదనలు స్థానికులను కలచివేసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యాశాలకు తరలించి, ఎస్ ఐ వేంకటాద్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ధరలు తగ్గాలి అంటే జగన్ దిగి పోవాలి




## ఏది కొనేటట్లు లేదు ఏం తినేటట్లు లేదు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ నాగేశ్వర రెడ్డి

మంత్రాలయం ఆగస్టు28, ( విభారె) : రాష్ట్రంలో ధరలు తగ్గాలి అంటే జగన్ మోహన్ రెడ్డి దిగి పోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ ,గ్యాస్, నిత్యావసర సరుకుల పెరుగుదలకు నిరసనగా తెలుగు దేశం పార్టీ అదిష్టానం పిలుపు మేరకు నిరసన కార్యక్రమం జరిగింది.స్తానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయం నుండి పుర వీదులగుండా సోమప్ప సర్కిల్లో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఏమి కొనేటట్టు లేవు ఏమీ తినేటట్టు లేవు అంటూ నినాదాలు చేస్తూ గ్యాస్ పెట్రోలు డీజిల్ నిత్యవసర వస్తువుల ధరలు తగ్గాలి అంటే జగన్ దిగిపోవాలి అంటూ నినాదాలు చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో పెట్రోల్ డీజిల్ పై వ్యాట్ రద్దు చేస్తానన్నాడు నేడు పెట్రోల్ పై వ్యాట్ 31.50%నుండి35.20%కు డీజిల్ పై వ్యాట్ 22.25%నుండి27%కు పెంచారు వీటికి అదనంగా డెవలప్మెంట్ సెస్ రోడ్డు సెస్ ల పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచాడు. అలాగే వంటి గ్యాస్ ధర తొమ్మిది వందల ఇరవై తొమ్మిది రూపాయలు దాకా విపరీతంగా పెంచి ప్రజల ఇబ్బందులకు కారణమయ్యాడు. డీజిల్ పెట్రోల్ ధరలు వంద రూపాయలకు పైగా పెరిగి ప్రజలు వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది పెట్రోలు కొనలేక తమ స్కూటర్లను అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెట్టి ప్రజలను అప్పుల పాలు చేసి ప్రజల నడ్డి విరగొడుతున్నాడంటూ ఆరోపించారు. అలాగే జగన్ పాలనలో ప్రజలు పై పన్నుల భారం ఎక్కువ పడుతుంది అని కరోనాతో ఆదాయం లేక ప్రజలు అల్లాడుతుంటే ప్రజలు పై ఆస్తి పన్ను చెత్త పన్ను ఆ పన్ను ఈ పన్ను అంటూ పన్నులు వేయడం ఎంతవరకు న్యాయం అని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకులు నుండి అని వస్తువులు ధరలు పెరిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర లో ఇచ్చిన మాట ప్రకారము జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేయడం లేదు అని పరిపాలన లో ఘోరంగా విఫలం అయ్యాడు అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి గారు ప్రజలు మద్యకు రాకుండ ఎక్కడ నుండి పరిపాలన చేస్తాడో ప్రజలు గమనిస్తూ వున్నారు ముఖ్యమంత్రి ప్రజలోకి వచ్చి పరిపాలన చేయాలని అప్పుడే సమస్యలు తెలుస్తాయని అన్నారు.ధరలు తగ్గాలి అంటే జగన్ పోవాలి అని నినాదాలు చేస్తూ బారి ఎత్తుగా నిరసన వ్యక్తం చేశార నాపై గెలిచిన చెన్నకేశవ రెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి ఏమి చేసింది లేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఏ ఊర్లో కి వెళ్ళిన మేము చేసిన అభివృద్ధి పనులే తప్ప , ఇప్పటి ప్రభుత్వం అభివృద్ధి చేసింది ఏమీ లేదని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి మేము ఎంతో కృషి చేశామని మీరు కూడా మీ ప్రభుత్వం ఉంది కాబట్టి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అందుకు మేము కూడా సంపూర్ణంగా సహకరిస్తామని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాలుగా అధికారం ఉంది కదా నియోజకవర్గ అభివృద్ధి చేస్తారని మేము అనుకున్నామని కానీ నియోజకవర్గం ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆయన విమర్శించారు. తెలుగుదేశం హాయాంలో ఇసుక రీచులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఇసుక ఉంచామని కానీ ఇప్పటి జగన్ ప్రభుత్వం ప్రజల ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక కొరకు నానా ఇబ్బందులు పడే పరిస్థితి తెచ్చిపెట్టారని అన్నారు.ప్రజల ఇల్లు కట్టుకోవడానికి ఇసుక తెచ్చుకుంటే వారిపై కేసులు బనాయిస్తున్నారని ప్రజలు ఎలా ఇల్లు కట్టుకోవాలి అని ప్రశ్నించారు. ఇసుక రీచ్ లో ఏర్పాటు చేసి ప్రజల ఇల్లు కట్టుకోవడానికి సహకరించాలని కోరారు. .ప్రజలను అష్టకష్టాలు పాల చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి భవిష్యత్తు లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. ఇంటింటికి రేషన్ బియ్యం అని చెప్పి వాహనాలను వీధులలో కాలనీ లో ఏదో ఒక మూలన రేషన్ వేస్తున్నారని ప్రజలు రేషన్ తె చ్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని విమ ర్శించారు. దీనివల్ల ప్రజలయలు నష్టం కలిగించారని ఆరోపించారు. నియో జకవ ర్గంలోని ఆయా మండలాల టిడిపి నాయకులు ఇన్చార్జులు కార్యకర్తలు అధిక సం ఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించండి..సీపీఐ, సిపిఎం




## బషీర్ బాగ్ ఉద్యమంలో అమరులయిన వారికి నివాళులు అర్పించిన పత్తికొండ వామపక్షాలు నేతలు..

పత్తికొండ ఆగస్టు28, ( విభారె) : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 2000 సంవత్సరంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ కలిసి చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో వామపక్ష పార్టీల నాయకులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణు వర్ధన్ రెడ్డిలు మరణించడం జరిగిందని ఈ రోజు పత్తికొండలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి నాలుగు స్తంభాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఉద్యమంలో అమరులైన మృతులకు నివాళులు అర్పిస్తూ నూతన విద్యుత్తు సంస్థలకు వ్యతిరేకంగా ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి బి.సురేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగింది. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పత్తికొండ మండల సిపిఐ కార్యదర్శి డి.రాజా సాహెబ్ నివాళులు అర్పించడం జరిగిందని, వారి స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామని, వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని వారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడానికి సిద్ధం కావాలని, విద్యుత్ సంస్కరణలు అమలుచేసి దేశ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, దేశాన్ని అంబానీ, ఆధాని లకు అమ్మడానికి కుట్ర చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ ప్రజానీకం పోరాటాలు నిర్వహించి దేశాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులు వేసుకున్న బోర్లకు మీటర్లు బిగించేందుకు కార్యక్రమం తీసుకు వచ్చాడని దీని ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని వారి తండ్రిగారైన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులకు ఎంతో మేలు చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ కే మంగళంపాడే కార్యక్రమం పెట్టిన జగన్ మోహన్ రెడ్డి మడమ తిప్పని, మాటతప్పని పాదయాత్రలో మాట ఇచ్చి అనేక ప్రజావ్యతిరేక సంస్కరణలను పాల్పడుతున్నారని ఇప్పటికే రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఉన్నారు. మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు విద్యుత్ సంస్కరణలు పేరుమీద బోర్లకు మీటర్ బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల మీద రుద్దుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని మద్దతివ్వడం చాలా దుర్మార్గం అని వారు దుయ్యబట్టారు. ఓ పక్క రైతులకు నేను అనుకూలమని చెబుతూ..మరోపక్క పార్లమెంట్లో రైతు వ్యతిరేకంగా బిల్లుకు అనుకూలంగా మాట్లాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దొంగ వైఖరి విడనాడాలని వారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం అధికారపక్షం రెండు కూడా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి అనుకూలమని ఈ రాష్ట్రంలోనే ఒకరిమీద ఒకరు విమర్శ చేసుకుంటూ మేము రైతులకు అనుకూలమంటూ పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్తారు. ఈ వైఖరి మారకపోతే రానున్న రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి, తెలుగుదేశం పార్టీకి రైతులు ప్రజలు గుణపాఠం చెప్తారని సీపీఐ, సిపిఎం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, కృష్ణయ్య, సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, సిపిఎం నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు నెట్టికంటయ్యా, రామాంజనేయులు, రవి, రామచంద్ర, రామాంజనేయులు, ఉరుకుంద, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

**అమరవీరుల పోరాట స్ఫూర్తితో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం వామపక్షాలు పిలుపు**

కౌతాళం ఆగస్టు28, ( విభారె)2000 సంవత్సరంలో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా బషీర్బాగ్ దగ్గర చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో వామపక్ష పార్టీల నాయకులు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ప్రాణాలు విడిచారు. శనివారం సిపిఎం పార్టీ కార్యాలయం దగ్గర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి పోరాట ఫలితంగా ఈ రోజుకి రైతులకు ఉచిత విద్యుత్ అవుతుందని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జగదీష్, నాగేంద్రప్ప, తెలిపారు

# శంకర్ వెంట ది గ్రేట్ సైంటిస్ట్ టెక్నాలజీ మిసైల్ లేని లోటు!



రచయితలు వేరు.. దర్శకులు వేరు. రచయిత రాసిన సన్నివేశాన్ని విజువల్ గా ఊహించి తెర రూపం ఇవ్వడం దర్శకుడి పని. అయితే రచయిత నుంచి సాధ్యమైనంత వరకూ దృశ్యాలకు సంబంధించిన ఇన్ పుట్స్ ఉంటాయి. దాంతో దర్శకుల పని చాలా సులువు అయిపోతుంది. ఇది రచయితలతో దర్శకుని డిస్కషన్స్ ద్వారా సాధ్యపడేది. అయితే ఇటీవలి కాలంలో స్టార్ డైరెక్టర్ శంకర్ రైటింగ్ విభాగం కాస్త వీక్ గా కనిపిస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.దానికి కారణం లేకపోలేదు.. శంకర్ కొలువులో ఇంతకుముందు మాస్టర్ మైండ్ అనదగ్గ గొప్ప రచయిత ఉండేవారు. ఆయన పేరు సుజాత రంగరాజన్. తమిళనాట ప్రసిద్ధ నవలారచయిత. ప్రొఫెసర్.. ఎన్నో సైన్స్ ఫిక్షన్ కథాంశాల్ని ఆయన రాసారు. టెక్నాలజీ గురువుగా యువతరం సందేహాలకు మ్యాగజైన్ రైటర్ గా సమాధానాలిచ్చేవారు. అలాంటి గ్రేట్ రైటర్ శంకర్ కొలువులో లేకపోవడం నిజంగా తీరని లోటు. ది గ్రేట్ సుజాత రంగరాజన్ (72) జెంటిల్ మేన్ మొదలు రోబో చిత్రం వరకూ శంకర్ కి కథలు రాసి స్క్రిప్టు పనులు చేశారు. 100 నవలలు 250 పైగా చిట్టి కథల్ని రాసిన అనుభవజ్ఞుడు. ఫిక్షన్ సైన్స్ ఫిక్షన్ నాన్ ఫిక్షన్ ఇలా అన్ని విభాగాల్లోనూ ఆయన గొప్ప రచనలు చేశారు.కానీ ఈరోజు ఆయన లేరు. 27 ఫిబ్రవరి 2008లో ఆయన మరణించారు. రోబో 2008లో మొదలై 2010లో రిలీజైంది. అనంతర కాలంలో సుజాత రంగరాజన్ లేని లోటును పూడ్చేందుకు శంకర్ చాలానే శ్రమించాల్సి వచ్చింది. ఇక రోబో సీక్వెల్ ప్రీక్వెల్ కాని ఒక సరికొత్త కథతో 2.0 తెరకెక్కిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి తమిళ ఫిలిం క్రిటిక్ రచయిత జేయ మోహన్ తో కలిసి శంకర్ స్క్రిప్ట్ వర్క్ చేశారు.ప్రస్తుతం రామ్ చరణ్ తో శంకర్ ఆర్.సి15 తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే శంకర్ పనులు మొదలు పెట్టాడు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్ లో చరణ్ పై ఫోటోషూట్ సహా లాంచింగ్ కి రంగం సిద్ధమవుతోంది. ఆర్.సి15 కథాంశంపైనా పరిశ్రమ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఖీఅ15 ఒక రాజకీయ డ్రామా.. అవినీతి రాజకీయాలను తెరపై ఆవిష్కరించనున్నారు. అయితే ఈ సినిమా స్క్రిప్టు వర్క్ లో ఈసారి ఎవరు పాలుపంచుకుంటున్నారు? సుజాత్ రంగరాజన్ లేరు... జర్నలిస్ట్ జేయ మోహన్ ఈ చిత్రానికి పని చేయడం లేదు. అందుకే ఇప్పుడు దర్శకరచయిత కార్తీక్ సుబ్బరాజన్ తో కలిసి శంకర్ స్క్రిప్టును వందశాతం ఫైనలైజ్ చేసేందుకు వర్క్ చేస్తున్నారని తెలిసింది.గతంలో జిగర్తాండ- పెట్టా - జగమే తంతిరం చిత్రాలకు దర్శకత్వం వహించిన కార్తీక్ సుబ్బరాజ్ ఈ ప్రాజెక్ట్ లో భాగమవుతున్నారు. కోలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీకి సన్నిహిత వర్గాల వివరాల ప్రకారం.. కార్తీక్ ఈ సినిమా కథ అభివృద్ధిలో పాలుపంచుకున్నారని తెలిసింది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు శంకర్ తో పనిచేయడం ఇదే మొదటిసారి. అలాగే ఆ ఇద్దరితో రచయితల బృందం సన్నివేశాల రూపకల్పన కోసం పని చేస్తోంది.శంకర్ కొలువులో సుజాత రంగరాజన్ అంత ప్రభావవంతమైన మరో రచయిత ఇప్పట్లో లేనే లేరు. ఆయన అనుభవం కానీ ఆయన మేధోతనం కానీ తమిళనాట పుట్టుకురావడం కూడా అంత సులువేమీ కాదు. అంతటి అసాధారణ ప్రజ్ఞావంతుడిగా అతడు పాపులరయ్యారు. సైన్స్ అండ్ టెక్నాలజీ పరిజ్ఞానాన్ని సామాన్యులకు ఎలా అనువర్తించాలి? అన్నది చెప్పగలిగే క్రియేటివ్ జీనియస్ ఆయన. అందుకే సుజాత రంగరాజన్ రచయితగా ఉన్న ప్రతి సినిమాలో సన్నివేశాలు పూర్తిగా మాస్ కి సామాన్యులకు కనెక్టెడ్ గా అలరించాయి. రోబోలాంటి హై టెక్నికల్ స్టాండర్డ్ మూవీలోనూ సామాన్య ఆడియెన్ కి అర్థమయ్యేంత క్లారిటీగా శంకర్ చూపించారంటే దానివెనక ప్రధాన బలం సుజాత రంగరాజన్.

# సెకండ్ వేవ్ తర్వాత టాప్-10 రిలీజ్ లు ఇవే!

కరోనా మహమ్మారీ సెకండ్ వేవ్ అనంతరం సినిమాల రిలీజ్ షెడ్యూళ్లపై రకరకాల కన్ఫ్యూజన్లు నెలకొన్న సంగతి తెలిసిందే. ఏది థియేటర్లలో విడుదలవుతుంది? ఏది ఓటీటీల్లో వస్తుంది? అన్నదానిపైనా సరైన స్పష్టత లేదు.ఇప్పటికే గోపిచంద్ 'సీటీమార్'.. అవసరాల '101 జిల్లాల అందగాడు' చిత్రాలు సెప్టెంబర్ 3న థియేట్రికల్ గా విడుదలవుతాయని కథనాలొస్తున్నాయి. వీటికి సంబంధించి మేకర్స్ అధికారికంగా క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. సెప్టెంబర్ 3న 'ప్రియమైన మేఘ' విడుదలకు సిద్ధమవుతోంది.ఆ తర్వాత సెప్టెంబర్ 10న రెండు పెద్ద సినిమాలు రిలీజ్ లకు రానున్నాయి. వీటిలో నాగచైతన్య 'లవ్ స్టోరి' థియేట్రికల్ రిలీజ్ తేదీ అధికారికంగా కన్ఫామ్ కాగా కంగన తలైవి ని అదే రోజున వినాయక చవితి వారంతంలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. తలైవి పాన్ ఇండియా కేటగిరీలో రిలీజ్ కానుంది. టక్ జగదీష్ - సెప్టెంబర్ లో ప్రైమ్ వీడియో (రా) లో విడుదల కానుంది. అలాగే నితిన్ - మాస్ట్రో - హాట్ స్టార్ (రా) లో సెప్టెంబర్ లోనే విడుదలవుతుంది. సెప్టెంబర్ 10న ఇతర సినిమాలు రిలీజవుతున్నందున టక్ జగదీష్.. మాస్ట్రో రిలీజ్ తేదీల్ని వాయిదా వేశారని ప్రచారమవుతోంది. ఈ సినిమాని ఓటీటీలో రిలీజ్ చేసేందుకే నిర్మాతలు ప్లాన్ చేయడంపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. అలాగే మాస్ట్రో రిలీజ్ తేదీపైనా నితిన్ వర్గాలు అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంటుంది.సెప్టెంబర్ 9 నుంచి మాస్ట్రో ఓటీటీలో స్ట్రీమింగ్ చేసేందుకు ప్లాన్ చేసినా ఇప్పుడు తేదీ మారిందని సమాచారం. టక్ జగదీష్ ఆ మరునాడే అంటే సెప్టెంబర్ 10 నుంచే స్ట్రీమింగుకి రెడీ అవ్వాల్సి ఉన్నా ఇంకా డైలమా నెలకొంది. నిర్మాతలు తేదీల్ని అధికారికంగా ప్రకటించాకే దీనిపై క్లారిటీ వస్తుంది.ఆ తర్వాత అక్టోబర్ 1న సాయి తేజ్ రిపబ్లిక్ రిలీజ్ కానుంది. సాయి తేజ్ సోదరుడు వైష్ణవ్ తేజ్ నటించిన రెండో సినిమా 'కొండపోలం' అక్టోబర్ 08 న విడుదలకు ప్లాన్ చేశారని తెలిసింది. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే. తదుపరి దసరా కానుకగా ఖీఖీఖీ అక్టోబర్ 13న విడుదల కావాల్సి ఉండగా వచ్చే ఏడాది సమ్మర్ కి వాయిదా పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.



# గోవా వెకేషన్ ముగించి చార్టర్డ్ విమానంలో దిగిన మహేష్ అండ్ ఫ్రెండ్స్

టాలీవుడ్ లో పలువురు స్టార్లు సొంతంగా చార్టర్డ్ విమానాలను కలిగి ఉన్నారని ప్రముఖ మీడియాల్లో కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. కుటుంబ వేడుకలు వెకేషన్లకు అర్జెంట్ నీడ్స్ కి వీటిని సదరు సెలబ్రిటీలు వినియోగిస్తున్నారు.కరోనా క్రైసిస్ నేపథ్యంలో చార్టర్డ్ విమాన ప్రయాణాలు మరీ ఎక్కువయ్యాయి. కార్ లో వెళ్లినంత ఈజీగా విమానయానాలకు సెలబ్రిటీలు సిద్ధమవుతున్నారు. సొంత ప్రయాణ ఒప్పందాల మేరకు విమానాలను విరివిగా వినియోగించగలుగుతున్నారు.ఇటీవల సర్కార్ వారి పాట చిత్రీకరణలో బిజీ అయిన మహేష్ కొంత విరామం తీసుకుని తన స్నేహితుడు వంశీ పైడిపల్లి కుటుంబంతో వెకేషన్ ని ప్లాన్ చేశారు. మహేష్ - పైడిపల్లి కుటుంబాలు కలిసి ఈ వెకేషన్ ని ఆస్వాధించి తిరిగి చార్టర్డ్ ఫ్లైట్ లో హైదరాబాద్ లో దిగారు. అందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఇక వీళ్లతో పాటు మహేష్ కుమార్తె బేబి సితార .. వంశీ పైడిపల్లి గారాల డాటర్ ఆద్య కూడా ఉన్నారు. ఇంతకీ ఈ బృందం ఎక్కడికి వెళ్లారు? అంటే.. బీచ్ సొగసుల గోవా విజిట్ కి వెళ్లారని తెలిసింది.వెకేషన్ ముగిసింది. ఈ వెకేషన్ లో మహేష్ - పైడిపల్లి మధ్య ఎలాంటి చర్చలు సాగాయి? అంటే దానికి సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. మహర్షి తర్వాత వెంటనే పైడిపల్లితో సినిమా చేయాల్సి ఉన్నా స్క్రిప్టు సరైనది కుదరకపోవడంతో మహేష్ ఆ తర్వాత పరశురామ్ తో సర్కార్ వారి పాట సెట్స్ కి వెళ్లారు. తదుపరి త్రివిక్రమ్ తో ప్రాజెక్ట్ కి కమిటయ్యారు. ఆ తర్వాత అయినా పైడిపల్లికి అవకాశం ఉంటుందేమో చూడాలి. అయితే మహేష్ చరిష్మాకి ధీటైన పాపులారిటీ ఉన్న గ్రేట్ కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ తో పైడిపల్లి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది ద్విభాషా చిత్రంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన తాజా అప్ డేట్స్ రావాల్సి ఉంది.



# టీమిండియాకు పరాభవం..



## ఇన్నింగ్స్ 76 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓటమి

ఇంగ్లండ్తో జరుగుతున్న మూడో టెస్ట్లో టీమిండియా ఘోర పరాభవాన్ని మూట గట్టుకుంది. ఆతిథ్య జట్టు చేతిలో ఇన్నింగ్స్ 76 పరుగుల తేడాతో పరాజయాన్ని ఎదుర్కొంది. ఓవర్నైట్ స్కోర్ 215/2తో నాలుగో రోజు ఆట ఆరంభించిన భారత్ వరుసగా వికెట్లు సమర్పించుకుంటూ తొలి సెషన్లోనే చాపచుట్టేసింది. ఇంగ్లండ్ పేసర్ల ధాటికి టీమిండియా ఓవర్నైట్ స్కోర్కు మరో 63 పరుగులు జోడించి 278 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లు రాబిన్సన్(5/65), ఒవర్టన్(3/47) టీమిండియా పతనాన్ని శాసించారు. ఆండర్సన్, మొయిన్ అలీకి తలో వికెట్ దక్కింది. కాగా, ఐదు టెస్ట్ల సిరీస్లో తొలి టెస్ట్ డ్రా కాగా, రెండో టెస్ట్లో భారత్ గెలుపొంది 1-0 ఆధిక్యంలో నిలిచింది. అయితే, మూడో టెస్ట్లో ఆతిథ్య జట్టు గెలుపొందడంతో సిరీస్ 1-1తో సమం అయ్యింది. ఇరు జట్ల మధ్య నాలుగో టెస్ట్ సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభంకానుంది. ఇన్నింగ్స్ ఓటమికి టీమిండియా మరో వికెట్ దూరంలో ఉంది. ఒవర్టన్ బౌలింగ్లో బట్లర్కు క్యాచ్ ఇచ్చి జడేజా(30) తొమ్మిదో వికెట్గా వెనుదిరిగాడు. ప్రస్తుతం టీమిండియా స్కోర్ 278/9. ఇన్నింగ్స్ పరాభవాన్ని తప్పించుకోవాలంటే మరో 76 పరుగులు చేయాల్సి ఉంది. ఇంగ్లండ్ పేసర్ రాబిన్సన్ ఖాతాలో మరో వికెట్ పడింది. వికెట్కీపర్ బట్లర్కు క్యాచ్ ఇచ్చి ఇషాంత్(2) వెనుదిరిగాడు. ఈ వికెట్తో రాబిన్సన్ ఒకే ఇన్నింగ్సలో 5వికెట్ల ఘనతను రెండోసారి సాధించాడు. ప్రస్తుతం టీమిండియా స్కోర్ 257/8. ఇన్నింగ్స్ ఓటమి పరాభవాన్ని తప్పించుకోవాలంటే భారత్ మరో 97 పరుగులు చేయాల్సి ఉంది. క్రీజ్లో జడేజా, బుమ్రా ఉన్నారు. మూడు టెస్ట్లో టీమిండియాకు ఘోర పరాభవం తప్పేలా లేదు. నాలుగో రోజు తొలి సెషన్లో వరుసగా పెవిలియన్కు క్యూ కడుతున్న భారత ఆటగాళు కనీసం ఇన్నింగ్స్ ఓటమి పరాభవాన్ని తప్పించుకుందాం అన్న ధ్యాస లేకుండా వికెట్లు సమర్పించుకుంటున్నారు. 239 పరుగుల వద్ద ఆరో వికెట్ కోల్పోయిన భారత్ మరో 15 పరుగులు జోడించి 254 పరుగుల వద్ద ఏడో వికెట్(షమీ)ను కోల్పోయింది. షమీ(6) ని మొయిన్ అలీ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇన్నింగ్స్ ఓటమి పరాభవాన్ని తప్పించుకోవాలంటే టీమిండియా మరో 100 పరుగులు చేయాల్సి ఉంది. ఇంగ్లండ్ పేసర్ రాబిన్సన్ నిప్పులు చెరిగే బంతులతో టీమిండియా ఆటగాళ్లను కుదురుకోనివ్వట్లేదు. నాలుగో రోజు ఆటలో తొలుత పుజారాను ఔట్ చేసిన రాబిన్సన్.. ఆతర్వాత కోహ్లిని, తాజాగా పంత్ను పెవిలియన్కు పంపి టీమిండియా ఓటమికి బాటలు వేస్తున్నాడు. రాబిన్సన్(4/58) ధాటికి భారత్ 239 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. క్రీజ్లో జడేజా, షమీ ఉన్నారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే టీమిండియా మరో 115 పరుగులు చేయాల్సి ఉంది. నాలుగో రోజు తొలి సెషన్లోనే టీమిండియా ఖేల్ ఖతం అయ్యేలా కనిపిస్తుంది. ఓవర్నైట్ స్కోర్కు ఒక్క పరుగు కూడా జోడించకుండానే పుజారా(91) వెనుదిరగగా, తాజాగా వరుస ఓవర్లలో కోహ్లి(55), రహానే(10) పెవిలియన్ బాట పట్టారు. దీంతో టీమిండియా 239 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి ఓటమిని దాదాపు ఖరారు చేసుకుంది. కోహ్లి రాబిన్సన్ బౌలింగ్లో రూట్కు క్యాచ్ ఇచ్చి ఔట్ కాగా, రహానేను ఆండర్సన్ బోల్తా కొట్టించాడు. క్రీజ్లో పంత్(1), జడేజా(0) ఉన్నారు. ప్రస్తుతం భారత్ మరో 115 పరుగులు వెనుకబడే ఉంది.టీమిండియా అభిమానులు ఏదైతే జరగకూడదని అనుకున్నారో అదే జరిగింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**